Sweken
WE ARE HIRING !!
➤ NET Developers
➤ Data Entry
INTERESTED CANDIDATES PLEASE SEND YOUR RESUME TO
MAIL: careers@sweken.com
PH: 9100980585

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

Bhavya Sai
PHOTO & VIDEO FILMING
Event Photo & Videography
Best Price
Photos & Videos Delivered with in 24 Hrs...
Press Events PRO in Vizag
CELL 9948511438

RNI No.52722/90 సంపుటి : 35 సంచిక : 154 విశాఖపట్నం, 29 మార్చి 2025 శనివారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00

# నామినేటెడ్ పదవుల జాతర

- ఏపీలో47 మార్కెట్ కమిటీలకు ఛైర్మన్ల నియామకం



**అమరావతి, (విశాఖ సమాచారమ్) :** **ఏపీలో 47 మార్కెట్ కమిటీలకు ఛైర్మన్‌లను కూటమి ప్రభుత్వం ప్రకటించింది. మొత్తంగా సభ్యులతో కలిపి 705 నామినేటెడ్ పదవులు భర్తీ చేసింది. ప్రకటించిన 47 ఏఎంసీ ఛైర్మన్ పదవుల్లో 37 టీడీపీ, 8 జనసేన, 2 బీజేపీ నాయకులకు దక్కాయి. సభ్యులతో కలిపి 705 నామినేటెడ్ పదవులు భర్తీ చేయనుంది. త్వరలోనే మిగిలిన మార్కెట్ కమిటీల ఛైర్మన్లను ప్రకటిస్తారు.**

### అభ్యర్థుల ఎంపికకు ప్రజాభిప్రాయ సేకరణ..

నామినేటెడ్ పదవుల భర్తీకి సీఎం చంద్రబాబు వినూత్న విధానాన్ని అమలు చేస్తున్నారు. ఐవీఆర్ఎస్ ద్వారా కార్యకర్తల నుంచి అభిప్రాయాలు సేకరించారు. అదే విధంగా మిత్రపక్షాల నాయకులతో విస్తృతంగా చర్చించి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఆశావహులు ఎక్కువగా ఉండడంతో పూర్తి స్థాయిలో కసరత్తు చేశారు. పొత్తులో భాగంగా పోటీ చేసిన బీజేపీ, జనసేన పార్టీలకు దామాషా ప్రకారం నామినేటెడ్ పోస్టులు దక్కాయి. పార్టీ కోసం నిరంతరం శ్రమించిన వారు, పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు వెన్నుదన్నుగా నిలిచిన వారికి పదవులు దక్కాయి . ఇంకా మరికొన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీలకు, 60 కీలక కార్పొరేషన్లకు, 21 ఆలయ పాలకవర్గాలకు నియామకాలు చేపట్టాల్సి ఉంది. కాగా, టీడీపీ గత ఏడాది సెప్టెంబరులో నామినేటెడ్ పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టింది. మహానాడు కంతా అన్ని పదవులు భర్తీ చేయాలని తెలుగు దేశం పార్టీ అధిష్టానం భావిస్తోంది. ఈ క్రమంలో టీడీపీ నుంచి పెద్ద సంఖ్యలో ఆశావహులు ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఏకంగా 60 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. తొలి జాబితాలో 20 కార్పొరేషన్ల ఛైర్మన్లతోపాటు మొత్తం 99 మందికి అవకాశం కల్పించారు. రెండో జాబితాలో మొత్తం 59 మందికి అవకాశం కల్పించారు.

## అందరం శ్రమిస్తే .. అగ్రస్థానానికి భారత్

**- ఏపీ సీఎం చంద్రబాబు**



**చెన్నై:** ఇప్పుడు ప్రపంచమంతా భారత్ వైపు చూస్తోందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. భవిష్యత్ అంతా భారతీయులదేనని చెప్పారు. మద్రాస్ ఐఐటీలో శుక్రవారం నిర్వహించిన 'ఆల్ ఇండియా రీసెర్చ్ స్కాలర్స్ సమ్మిట్ 2025' కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. "మద్రాస్ ఐఐటీ ఎన్నో విషయాల్లో నంబర్ వన్‌గా ఉంది. ఆన్‌లైన్ కోర్సులు కూడా అందిస్తోంది. ఐఐటీ మద్రాస్ స్టార్టప్ అగ్నికుల్ మంచి విజయాలు అందుకుంది. ఇక్కడి స్టార్టప్‌లు 80 శాతం విజయవంతమవుతున్నాయి. ఈ ఐఐటీలో సుమారు 35-40 శాతం తెలుగు విద్యార్థులే ఉన్నారు. ఐఐటీల స్థాపన దేశ విద్యా రంగంలో గొప్ప ముందడుగు. ఆర్థిక సంస్కరణలు దేశ ముఖ చిత్రాన్ని సమూలంగా మార్చేశాయి. 1991లో తీసుకొచ్చిన సంస్కరణలు ఎంపిక కాదు.. తప్పనిసరి. రాజకీయ సంస్కరణలతో సోవియట్ రష్యా అనేక దేశాలుగా విడిపోయింది. అదే సమయంలో చైనా ఆర్థిక సంస్కరణలు ప్రారంభించింది. ఆ తర్వాత ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆ దేశం ఎదిగింది. భారత్ కూడా సంస్కరణల తర్వాత అభివృద్ధి బాట పట్టింది. బ్రిటిష్‌వారు మన దేశం నుంచి అంతా తీసుకెళ్లారు.. ఒక్క ఇంగ్లీష్‌ను మనకు వదిలేశారు. 1990లలో కమ్యూనికేషన్ రంగంలో బీఎస్ఎన్ఎల్, వీఎస్ఎన్ఎల్ గుత్తాధిపత్యం ఉండేది. ఆర్థిక సంస్కరణల తర్వాత కమ్యూనికేషన్ల రంగంలో ప్రైవేటు సంస్థల రాక ఓ గేమ్ ఛేంజర్. మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్‌ను మొదట కలుస్తానని అడిగినప్పుడు రాజకీయ నేతలతో ...(మిగతా 2లో)



## మంత్రి లోకేశ్‌తో టెక్ పిడుగు అఖిల్ భేటీ

**ఉండవల్లి, (విశాఖ సమాచారమ్) :** 11 ఏళ్ల టెక్ పిడుగు అఖిల్ ఆకెళ్ల శుక్రవారం ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌ను కలుసుకున్నారు. ఏపీకి చెందిన ఆకెళ్ల టెక్నాలజీ రంగంలో అద్భుతమైన ప్రతిభతకనబరుస్తున్నారు. ఉండవల్లిలోని నివాసంలో తన తండ్రితో కలిసి లోకేశ్‌తో సమావేశమయ్యారు. యూకేలో విద్యను అభ్యసిస్తున్న ఈ బాలుడు చిన్న వయసులోనే టెక్నాలజీ రంగంలో అద్భుత ప్రతిభను కనబరుస్తున్నాడు. ఈ రంగంలో ఎన్నో మైలురాళ్లను సాధించాడు. మైక్రోసాఫ్ట్ ధృవీకరించిన ...(మిగతా 2లో)

## నేడు టీడీపీ ఆవిర్భావ సభ



- ఎన్టీఆర్ భవన్‌లో వేడుకలకు అధినేత చంద్రబాబు

**అమరావతి, (విశాఖ సమాచారమ్) :** టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం (మార్చి 29) రెండు తెలుగు రాష్ట్రాల్లో ఘనంగా వేడుకలు జరగనున్నాయి. పార్టీ శ్రేణులు పార్టీ వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నారు. పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్‌కు ఘనంగా నివాళులర్పించానున్నారు. ఎన్టీఆర్ భవన్‌లో జరిగే వేడుకలకు సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ హాజరు కానున్నారు. శనివారం ఉదయం ఎన్టీఆర్ భవన్‌లో చంద్రబాబు పార్టీ జెండా ఎగురవేస్తారు. పార్టీ శ్రేణులు, కార్యకర్తలకు భవిష్యత్తు కార్యాచరణపై చంద్రబాబు దిశా నిర్దేశం చేస్తారు. అలాగే ఏపీ వ్యాప్తంగా ఆవిర్భావ వేడుకల నిర్వహణకు స్థానిక పార్టీ శ్రేణులు ఏర్పాట్లు చేస్తున్నారు.

## ప్రలోభాలకు లొంగని పార్టీ శ్రేణులకు హ్యాట్సాఫ్

**మాజీ సీఎం జగన్ ట్వీట్**



**తాడేపల్లి, (విశాఖ సమాచారమ్) :** ఆంధ్రప్రదేశ్‌లో శుక్రవారం జరిగిన స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో వైఎస్ ఆర్సీపీ ఎక్కువ స్థానాల్లో గెలుపొందింది. ఇప్పటివరకు 50 స్థానాలకు ఉప ఎన్నికలు జరగగా అందులో 39 స్థానాలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. దీనిపై వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి ట్విట్టర్ వేదికగా స్పందస్తూ.. పార్టీ శ్రేణుల ధైర్యాన్ని మెచ్చుకున్నారు. స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో కూటమి పార్టీలకు ఎలాంటి బలం లేకపోయినా, సీఎం చంద్రబాబు నాయుడు అధికార అహంకారాన్ని చూపి, పోలీసు యంత్రాంగాన్ని దుర్వినియోగం చేశారని అన్నారు. అలాగే వైసీపీ నేతలపై కేసులు పెట్టి, ఆస్తులు ధ్వంసం చేస్తామని, బంధువుల ఉద్యోగాలు తీసేస్తామని, జీవనోపాధి దెబ్బతీస్తామని భయపెట్టారని తెలిపారు. ఎన్ని ప్రలోభాలు పెట్టినా వాటన్నింటినీ బేఖాతరు చేస్తూ మన పార్టీ ఎంపీటీసీలు, జడ్పీటీసీలు ధైర్యంగా నిలబడి వైఎస్సార్ కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకున్నారని ...(మిగతా 2లో)



## పరిశ్రమల స్థాపనకు పక్కా ప్రణాళికలతో రండి

**డీఐఈపీసీ సమావేశంలో ఔత్సాహికులకు కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పిలుపు**

**రూ.23,870 కోట్లతో నాబార్డు "పోటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ విడుదల**

**విశాఖపట్నం, విశాఖ సమాచారమ్:** చిన్నచిన్న యూనిట్ల రూపంలో పరిశ్రమలు నెలకొల్పేందుకు పారిశ్రామిక ఔత్సాహికులు పక్కా ప్రణాళికలతో రావాలని, వారికి అన్ని విధాలుగా పూర్తి సహకారం అందిస్తామని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. ఇప్పటికే పరిశ్రమలు నిర్వహిస్తున్న వారు సాంకేతిక సహాయం, నైపుణ్యం కలిగిన సిబ్బంది కొరకు ప్రతిపాదనలు పంపిస్తే పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. శుక్రవారం కలెక్టరేట్ మీటింగు హాలులో జరిగిన జిల్లా ఇండస్ట్రియల్ ఎగుమతి ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశంలో ఆయన పలు అంశాలపై చర్చించారు. పరిశ్రమలు నెలకొల్పేందుకు ముందుకు వచ్చే వారికి అధికారులు సంపూర్ణ సహకారం అందించాలని ఈ సందర్భంగా సూచించారు. 2025-26 వార్షిక ప్రణాళికను దృష్టిలో పెట్టుకొని ఔత్సాహికులు, అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని, వీలైనన్ని పారిశ్రామిక యూనిట్లు ...(మిగతా 2లో)

## ఏసీబీకి చిక్కిన కాకినాడ జిల్లా రిజిస్ట్రార్




**కాకినాడ, (విశాఖ సమాచారమ్):** రూ.లక్ష లంచం తీసుకుంటూ కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ ఆనందరావు, అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి ఏసీబీ అధికారులకు చిక్కారు. రిజిస్ట్రేషన్ చేసేందుకు లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. స్పష్టమైన సమాచారంతో అవినీతి నిరోధక శాఖ అధికారులు రిజిస్ట్రార్ కార్యాలయంలో దాడులు నిర్వహించి.. ...(మిగతా 2లో)

## విశాఖ ఉక్కులో కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** స్టీల్ ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె ఉద్రిక్తతలకు దారి తీసింది. తమను విధుల్లోకి తీసుకోకపోతే నిరసనకు దిగుతామని రెండు రోజుల క్రితం హెచ్చరించిన కాంట్రాక్ట్ కార్మికులు.. దానిలో భాగంగానే శుక్రవారం సమ్మెకు పూనుకున్నారు. రోడ్డుపైనే బైఠాయించిన కార్మికులు.. తమను తొలగిస్తే సహించబోమని హెచ్చరించారు. దీంతో కూర్మన్నపాలెం ఆర్చ్ వద్ద ...(మిగతా 2లో)

## దేశంలో మీడియా కమిషన్ ఏర్పాటును స్వాగతిస్తాం



- ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు
- ఘనంగా జర్నలిస్టుల ఉగాది సంబరాలు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** జర్నలిస్టుల రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం మీడియా కమిషన్ ఏర్పాటుకు సూత్రప్రాయంగా అంగీకరించడం పట్ల ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. ఆంజనేయులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఇక్కడ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఏపీ వర్కింగ్ జర్నలిస్టులు ఫెడరేషన్,ఏపీ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టు అసోసియేషన్, ఏపీ స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో విశ్వావసు ఉగాది నామ సంవత్సర వేడుకలు అందరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆంజనేయులు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జర్నలిస్టులపై దాడులు పెరుగుతున్నాయని, అలాగే అనేక ప్రాంతాల్లో హత్యలు జరుగుతున్నాయని ఇటువంటి వాటికి అడ్డుకట్ట వేసేందుకు మీడియా కమిషన్ ఎంత గానో తోడ్పాటు అందిస్తుందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ద్వారా జర్నలిస్టులు సమస్యలు పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. గౌరవ అతిథులుగా హాజరైన ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ డీకే బారువ, ఏసీఏ మీడియా మేనేజర్ జై కిషన్, ప్రముఖ సంఘ సేవకులు మట్టపల్లి హనుమంతరావు,శంకర్ ఫౌండేషన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ బంగార్రాజు తదితరులు ...(మిగతా 2లో)



## ప్రేమికుల ఆత్మహత్య

- విశాఖలో విషాదం

**విశాఖపట్నం, విశాఖ సమాచారమ్:** నగరంలోని వడ్లపూడి ఆర్‌ఎస్ కాలనీలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఒక ప్రేమ జంట ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడం స్థానికంగా కలకలం రేపుతోంది. సంఘటన ...(మిగతా 2లో)

# మంత్రి లోకేశ్‌తో టెక్ పిడుగు అఖిల్ భేటీ

(మొదటి పేజీ తరువాయి)

అజ్యూర్, డేటా, సెక్యూరిటీతో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఫౌండేషన్ కోర్సుల్లో సర్టిఫికేషన్లు పొందాడు. యూకేలో నిర్వహించిన పలు టెక్ సమ్మిట్‌లలో పాల్గొన్నాడు. అమరావతిలో జరగనున్న సమాచార, సాంకేతిక అభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యేందుకు అఖిల్ ఆసక్తి చూపించడంతో త్వరలోనే కలుస్తానని మంత్రి లోకేశ్ ఆ మేరకు అఖిల్‌ను కలుసుకున్నారు. టెక్నాలజీలో అద్భుత ప్రతిభను కనబరుస్తున్న అఖిల్‌ను మంత్రి అభినందించారు. ముందు ముందు మరిన్ని విజయాలు అందుకోవాలని ఆకాంక్షించారు.

# ప్రలోభాలకు లొంగని పార్టీ శ్రేణులకు హ్యాట్సాఫ్

(మొదటి పేజీ తరువాయి)

తెలియజేశారు. విలువలకు, విశ్వసనీయతకు పట్టం కడుతూ ప్రజాస్వామ్య స్ఫూర్తిని నిలబెట్టిన పార్టీ ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, నాయకులను చూసి గర్వపడుతున్నానని అన్నారు. క్లిష్ట సమయంలో వీరు చూపించిన ధైర్యం పార్టీకి మరింత ఉత్తేజాన్ని ఇచ్చిందని, ఈ ఎన్నికలను సమన్వయ పరుస్తూ గెలుపునకు బాటలు వేసిన వివిధ నియోజకవర్గాల ఇన్‌ఛార్జిలు, జిల్లా అధ్యక్షులు, రీజినల్ కో-ఆర్డినేటర్లు, పార్టీ కేంద్ర కార్యాలయ సిబ్బంది అందర్నీ అభినందించారు. పార్టీకి అప్పుడూ, ఇప్పుడూ, ఎల్లప్పుడూ వెన్నుముకలా నిలుస్తున్న కార్యకర్తలకు హ్యాట్సాఫ్ అని జగన్ పేర్కొన్నారు.

# అందరం శ్రమిస్తే .. అగ్రస్థానానికి భారత్

(మొదటి పేజీ తరువాయి)

సంబంధం లేదని చెప్పారు. ఆయన్ను ఒప్పించి అపాయింట్‌మెంట్ తీసుకున్నా. 45 నిమిషాలు మాట్లాడారు. హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ సంస్థ నెలకొల్పాలని కోరాను. ఇప్పుడు అదే సంస్థకు సీఈవోగా తెలుగు వ్యక్తి సత్య నాదెళ్ల ఉన్నారు. కొంతకాలంగా భారత్ వృద్ధిరేటు ప్రపంచంలోనే అత్యధికంగా ఉంటోంది. 2014లో మనది పదో ఆర్థిక వ్యవస్థ.. ఇప్పుడు ఐదో స్థానానికి చేరింది. భారత్‌కు ఉన్న గొప్పవరం జనాభా.. డెమోగ్రాఫిక్ డివిడెండ్. మనమంతా కృషి చేస్తే త్వరలోనే ప్రపంచంలో భారత్ అగ్రస్థానానికి చేరుకుంటుంది. చాలా దేశాలు జనాభా తగ్గుదల సమస్యను ఎదుర్కొంటున్నాయి. మన దేశానికి మరో 40 ఏళ్ల వరకూ ఆ సమస్య లేదు" అని చంద్రబాబు అన్నారు.

# ఏసీబీకి చిక్కిన కాకినాడ జిల్లా రిజిస్ట్రార్

(మొదటి పేజీ తరువాయి)

నిందితులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ కిశోర్‌బాబు వెల్లడించిన వివరాల ప్రకారం.. తునికి చెందిన ఆర్. రమేశ్‌బాబు తన భార్య పేరిట ఉన్న సమత గ్యాస్ ఏజెన్సీని కొన్ని కారణాల వల్ల తన పేరు మీదకు మార్చాలని జిల్లా రిజిస్ట్రార్‌ను ఆశ్రయించారు. అందుకు ఆయన రూ.లక్ష డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఆనందరావు నుంచి రూ. లక్ష, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి నుంచి రూ.25వేలు, అనధికారికంగా ఉన్న మరో రూ.80వేల నగదును ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మధ్యవర్తిగా వ్యవహరించిన డాక్యుమెంట్ రైటర్ వెలుగుల జగదీశ్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు.

# ప్రేమికుల ఆత్మహత్య

(మొదటి పేజీ తరువాయి)

వివరాలు ఇలా ఉన్నాయి. మరిపాలెం ప్రాంతానికి చెందిన అమీర్ ఖాన్, సింహాచలం ప్రాంతానికి చెందిన పిన్నింటి వెంకట దుర్గ కలిసి ఓ స్నేహితుని ఇంట్లో శుక్రవారం ఉరివేసుకుని ప్రాణాలు తీసుకున్నారు. విషయం తెలియగానే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని విచారణ ప్రారంభించారు. పోలీసుల ప్రాథమిక దర్యాప్తు ప్రకారం, వీరి ఆత్మహత్యకు కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల నుంచి సమాచారం సేకరిస్తున్నారు. ఈ ఘటనపై దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# రెస్టారెంట్లలో సర్వీస్ ఛార్జీలపై ఢిల్లీ హైకోర్టు ఆగ్రహం



**ఢిల్లీ:** హోటళ్లు, రెస్టారంట్లు ఆహార బిల్లులలో సర్వీస్ ఛార్జీలను కలిపి వసూలు చేస్తుండడంపై ఢిల్లీ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. సర్వీస్ ఛార్జీలను విని యోగదారులు కచ్చితంగా చెల్లించేలా బిల్లులో వాటిని కలిపి ఇవ్వడం వారి హక్కులను ఉల్లంఘించడమే అవుతుందని పేర్కొంది. రకరకాల పేర్లతో ఛార్జీలు వసూలు చేయడం అన్యాయమైన వ్యాపార విధానాలతో సమానమని మండిపడింది. సర్వీస్ ఛార్జీలు చెల్లించాలా.. వద్దా..? అనే విషయాన్ని కస్టమర్ల విచక్షణకే వదిలేయాలని సూచించింది.

# ఎమ్మెల్యే కొలికపూడి వ్యవహారంపై అధిష్ఠానం సీరియస్



**అమరావతి, విశాఖ సమాచారమ్:** తిరువూరు టిడిపి ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్‌పై పార్టీ అధిష్ఠానం సీరియస్ అయ్యింది. కొలికపూడి వ్యవహారంపై అధిష్ఠానం నివేదిక కోరింది. ఎంపీ, జిల్లా అధ్యక్షుడు, సమన్వయకర్త కలిసి నివేదిక ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. తిరువూరులో గత 10 నెలలుగా జరిగిన ఘటనలపై పూర్తి నివేదిక ఇవ్వాలని తెలిపింది. అందరినీ కలుపుకొని వెళ్లాలని చెప్పినా ఎమ్మెల్యే తీరులో ఏమాత్రం మార్పు రాలేదని, బహిరంగ విమర్శలకు తావివ్వొద్దని చెప్పినా ధోరణి మార్చుకోలేదని అధిష్ఠానం అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. పార్టీ నేత రమేష్‌రెడ్డిపై చర్యలు తీసుకోకుంటే 2 రోజుల్లో రాజీనామా చేస్తానని కొలికపూడి పేర్కొన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే అధిష్ఠానం స్పందించినట్లు తెలుస్తోంది.

# సమష్టి కృషితో అగ్రస్థానంలో విశాఖ

**అధికారులకు కలెక్టర్ హరేంధిర ప్రసాద్ దిశా నిర్దేశం**

**మూడో విడత కలెక్టర్ సదస్సులో ముఖ్యమంత్రి ప్రస్తావించిన అంశాల వివరణ**




**విశాఖపట్టణం, విశాఖ సమాచారమ్:** స్వర్ణాంధ్ర సాకారంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని, అధికారులు సమష్టి కృషి చేసి విశాఖపట్టణం జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ నిర్దేశించారు. ప్రజలకు సంతృప్తికర రీతిలో సేవలందిస్తూ, అభివృద్ధి - సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ, సమ్మిళిత ఆర్థిక విధానాలకు పెద్దపీట వేస్తూ ప్రతి ఒక్కరూ వారి కర్తవ్యాలను నిర్వర్తించాలని సూచించారు. ఈ నెల 25, 26వ తేదీల్లో రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన మూడో విడత కలెక్టర్ల సదస్సు అంశాలను శుక్రవారం కలెక్టరేట్ మీటింగు హాలులో జరిగిన సమావేశంలో జిల్లా అధికారులకు వివరించిన ఆయన పలు అంశాలపై వారికి దిశానిర్దేశం చేశారు. అన్ని రంగాల్లో విశాఖ జిల్లాను ప్రథమ స్థానంలో నిలపటమే లక్ష్యంగా బాధ్యతగా పని చేయాలని హితవు పలికారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన స్వర్ణాంధ్ర ఏ 2047 విజన్ ప్లాన్, విశాఖపట్టణం 2025-29 ప్లాన్ ప్రాతిపదికగా ముందుకు సాగాలని అధికారులను పేర్కొన్నారు. విశాఖపట్టం రూపురేఖలు మార్చేలా ప్రతి ఒక్కరూ ప్రణాళికాబద్ధంగా పని చేయాలని, అంకిత భావం ప్రదర్శించాలని సూచించారు. మహానగరాన్ని మరింత అందంగా తీర్చిదిద్దేలా ప్రణాళికలు చేపట్టాలని, ఖ్యాతిని మరింత ఇనుమడింపజేసేలా కృషి చేయాలన్నారు. రంగాల వారీగా వివిధ అంశాలపై పీపీటీ ఇచ్చారు. పర్యాటక రంగ అభివృద్ధికి పుష్కలమైన అవకాశాలు ఉన్నాయని, ఆ దిశగా కొత్త ప్రాజెక్టులు చేపట్టాలని, కొత్త హోటళ్లు, రిసార్టులు ఏర్పాటు చేసేందుకు సహకారం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పీ-4 సర్వేకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, వాట్సాప్ గవర్నెన్స్‌కు ప్రాధాన్యత ఇస్తూ సేవలను మరింత విస్తృతం చేయాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, వీఎంఆర్డీఏ కమిషనర్ కె.ఎస్. విశ్వనాథన్, జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మయన్మార్‌లో భయంకర భూకంపం

**ఇంటర్నెట్‌డెస్క్:** మయన్మార్‌లో వచ్చిన భూకంపం అత్యంత శక్తిమంతమైందని అమెరికా జాతీయ భూకంప సమాచార కేంద్రంలోని భూభౌతిక శాస్త్రవేత్తలు చెబుతున్నారు. రెండేళ్ల క్రితం ఇటువంటిదే తుర్కియే, సిరియాలో సంభవించడంతో భారీగా ప్రాణనష్టం చోటు చేసుకొంది. ముఖ్యంగా మయన్మార్, థాయ్‌లాండ్ జనసాంద్రత అత్యధికంగా ఉన్న ప్రదేశాలు కావడంతో వీటిని రెడ్ ఈవెంట్లుగా వ్యవహరిస్తామని వెల్లడించారు. రెండేళ్ల క్రితం 7.8 తీవ్రతతో తుర్కియే, సిరియాలో భూకంపం సంభవించడంతో 53 వేల మంది ప్రాణాలు కోల్పోయారు. అదే విధంగా ఇక్కడ కూడా భారీగా ప్రాణనష్టం జరిగే అవకాశం ఉందని అమెరికా భూభౌతిక సర్వే సంస్థ పేర్కొంది.

వాస్తవానికి ప్రపంచంలో అత్యధిక భూకంపాలు వచ్చేందుకు అవకాశం ఉన్న ప్రదేశాల్లో మయన్మార్ ఒకటి. ఇండియన్ టెక్టానిక్ ప్లేట్, బర్మా మైక్రోప్లేట్‌కు మధ్య దాదాపు 1200 కిలోమీటర్ల ప్రదేశం ఇక్కడ ఉంది. చాలా సార్లు ఇక్కడ భూకంపాలు వచ్చిన చరిత్ర ఉంది. గత వందేళ్లలో మయన్మార్‌లో 6 తీవ్రత కంటే ఎక్కువగా 14 భూకంపాలు నమోదయ్యాయని బ్రిటిష్ జియోలాజికల్ సర్వే శాస్త్రవేత్త బ్రియాన్ బాప్టై వెల్లడించారు. శుక్రవారం ఒక్క రోజే ఆరు భూకంపాలు నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ వెల్లడించింది. అతి తీవ్రమైంది 7.7గా నమోదకాగా.. అత్యల్పమైంది 4.3గా ఉంది.

**భవనాలు, రోడ్లకు పగుళ్లు**

థాయ్‌లాండ్‌లో చాలా భవనాలకు పగుళు ఏర్పడటంతో ఉద్యోగులు, ప్రజలు వాటిల్లోకి వెళ్లేందుకు భయపడుతున్నారు. దీంతో ప్రజలు ఇంకా వీధుల్లోనే ఉన్నారు. బ్యాంకాక్‌లో భారీ భవనం కూలిపోయే సమయానికి దానిలో 320 మంది పనివారు ఉన్నట్లు తెలుస్తోంది. ఇక మయన్మార్



రాజధాని నేపిడా వద్ద ప్రధాన రహదారులు భూకంపం తీవ్రతకు చీలిపోయాయి. దేశంలోని రెండో అతిపెద్ద నగరమైన మాండలే ప్రాంతంలో ప్రాణనష్టం అధికంగా ఉండొచ్చన్న ఆందోళన వ్యక్తమైంది. అక్కడ పలు భవనాలు కుప్పకూలిన ఫొటోలు బయటకు వచ్చాయి. ఈ నగరం భూకంప కేంద్రానికి అతి దగ్గరగా ఉన్న ప్రదేశాల్లో ఒకటని అమెరికా జియోలాజికల్ సర్వే విభాగం పేర్కొంది. పైగా ఈసారి పది కిలోమీటర్ల లోతులోనే భూకంప కేంద్రం ఉండటంతో దాని తీవ్రత అత్యధికంగా కనిపించింది.

# దేశంలో మీడియా కమిషన్ ఏర్పాటును స్వాగతిస్తాం





(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ, క్రమం తప్పకుండా జర్నలిస్టులు ఉగాదితో పాటు అనేక పండుగలు కూడా నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యంగా తమ యూనియన్లు సేవలు అందిస్తున్నాయ న్నారు. తమ పరిధి మేరకు జర్నలిస్టులకు సహాయం అందిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా ప్రముఖ పండితులు బ్రహ్మశ్రీ బులుసు సాయి కృష్ణ శర్మ నిర్వహించిన పంచాంగ శ్రవణం చేశారు. పలువురు జర్నలిస్టుల పిల్లలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషం గా అలరించాయి.మహిళలు కు చీరలు, పిల్లలు కు బహుమతులు, పంచాంగం పుస్తకాలు పంపిణీ చేసారు. విశాఖ జిల్లా కార్యదర్శి పి. నారాయణ, కార్యదర్శి జి. శ్రీనివాస్ రావు, బ్రాడ్ కాస్ట్ కార్యదర్శి కె. మదన్, చిన్న, మధ్య తరహా పత్రికల సంఘం అధ్యక్షులు జగన్ మోహన్, విశాఖ సమాచారం దినపత్రిక సీఈవో వంశీ చక్రధర్ తదితరులతోపాటు వందలాది మంది జర్నలిస్ట్ లు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. జర్నలిస్ట్ ధ్రువతార మానికొండ భారతీయ జర్నలిజములో మానికొండ చలపతి రావు ధ్రువతారగా నిలిచారని ఆంధ్ర యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యులు బాబీ వర్ధన్ కొనియాడారు.. సీనియర్ పాత్రికేయులు ఆకుల అమరయ్య రచించిన మాని కొండ చలపతి రావు పుస్తకం ను ఆచార్య బాబీ వర్ధన్, జర్నలిస్ట్ నాయకులు జి.ఆంజనేయులు, కొండ బాబు, రంగా రెడ్డి, గంట్ల శ్రీనుబాబు, పి. నారాయణ తదితరులు చేతులు మీదుగా అవిష్కరించారు.. ఈ సందర్భంగా బాబీ వర్ధన్ మానికొండ గొప్ప తనము, జర్నలిస్ట్ గా ఆయన సాధించిన అద్భుతాలు, నిరాడంబర జీవితం, ఇతర విశేషాలు వివరించారు...ఈ పుస్తక రచన చేయడం తన అదృష్టం అని అమరయ్య పేర్కొన్నారు..ఉత్తరాంధ్ర ప్రాంతం కు చెందిన మాని కొండ చలపతి రావు జీవితం భవిష్యత్ తరాలకు ఆదర్శం అన్నారు.





# పరిశ్రమల స్థాపనకు పక్కా ప్రణాళికలతో రండి

(మొదటి పేజీ తరువాయి)

నెలకొల్పాలని పేర్కొన్నారు.జిల్లాలో నూతన పరిశ్రమల స్థాపనకు అనువైన మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతో పాటు నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించే లక్ష్యంతో అధికారులు పారిశ్రామిక రంగాన్ని బలోపేతం చేసేందుకు కార్యాచరణ రూపొందించాలని చెప్పారు. వనరులను సద్వినియోగం చేసుకుంటూ పారిశ్రామికంగా అభివృద్ధి పథంలో నడిపేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. గాజువాక, ఆటోనగర్ వద్ద గల రోడ్ ఓవర్ బ్రిడ్జి(ఆర్.వో.బి.), పెదగంట్యాడ, అగనంపూడి, ఆటోనగర్లలో ఫ్లాట్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్, పీఎం విశ్వకర్మ యోజన పథకం తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించిన ఆయన పలు అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. నిర్మాణాలకు, పరిశ్రమల నిర్వహణకు అవసరమైన నీటి వనరులను సమకూర్చాలని, సొసైటీ భవనాల నిర్మాణానికి తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. భూ సేకరణ, సింగిల్ విండో క్లియరెన్స్ అంశాల్లో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. ఎంఎస్ఎంఈ సెక్టార్ల ఏర్పాటులో చురుగ్గా వ్యవహరించాలన్నారు. కోర్టు కేసులు, విజిలెన్స్ కేసుల విషయంలో సత్వరమే స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. ఆక్రమణల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, నిర్ణీత సమయంలో చర్యలు తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో భాగంగా ఐలా ప్రతినిధులు, పారిశ్రామిక వేత్తలు ఆటోనగర్, ఐటీ హిల్స్ వద్ద కావల్సిన సదుపాయాలపై, అన్ని రకాల సమావేశాలకు, సభలకు ఉపయోగపడే విధంగా పెద్ద హాలు నిర్మాణంపై కలెక్టరుకు నివేదించారు.

**పీఎల్పీ విడుదల**

విశాఖపట్నం జిల్లా అవసరాలను దృష్టిలో ఉంచుకొని నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్మెంట్ (నాబార్డ్) 2025-26 సంవత్సరానికి సంబంధించి రూపొందించిన "పోటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్" (పి ఎల్ పి)ని కలెక్టర్, ఇతర అధికారుల చేతుల మీదుగా డీఐపీఈసీ సమావేశం అనంతరం విడుదల చేశారు. రూ.23,870.62 కోట్లతో క్రెడిట్ ప్లాన్ రూపొందించినట్లు నాబార్డ్ డెవలప్మెంట్ మేనేజర్ బసంత్ కుమార్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ ప్రణాళిక ముఖ్యంగా ఎం.ఎస్.ఎం.ఈ.లు, పునరుత్పాదక ఇంధనం, ఎగుమతి క్రెడిట్, సుస్థిర వ్యవసాయంపై దృష్టి సారించిందని పేర్కొన్నారు. ఎంఎస్ఎంఈ రంగానికి రూ.16,207.50 కోట్లు, ఎగుమతి ఆధారిత వ్యాపారాల కోసం రూ.612 కోట్లు, పునరుత్పాదక ఇంధన రంగానికి రూ.300.74 కోట్లు, వ్యవసాయ రంగానికి రూ.3,368.99 కోట్లు, ఇతర విభిన్న అవసరాల కోసం రూ.3,384.38 కోట్లు కేటాయించినట్లు వివరించారు. ఈ ప్రణాళిక అన్ని రంగాల అవసరాలను పరిగణనలోకి తీసుకొని సుస్థిర అభివృద్ధిని ప్రోత్సహించడంలో దోహదపడుతుందని బసంత్ కుమార్ పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జీఎం వి. ఆదిశేషు, నాబార్డ్ డెవలప్మెంట్ మేనేజర్ బసంత్ కుమార్, పలు పరిశ్రమల నిర్వాహకులు, ఐలా ప్రతినిధులు, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో 51 కరువు మండలాల గుర్తింపు



**అమరావతి, విశాఖ సమాచారమ్:** రాష్ట్రంలో 51 కరువు మండలాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. తీవ్ర ఎండలు, వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో కరువు మండలాలను గుర్తించాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. ఆయా మండలాల్లో పర్యటించిన అధికారులు కరువు పరిస్థితులను అధ్యయనం చేశారు. మొత్తం రాష్ట్రవ్యాప్తంగా 51 మండలాల్లో కరువు ఉన్నట్లు అంచనా వేశారు. సాంకేతికత ఆధారంగా కరువు మండలాలపై కలెక్టర్లు నివేదికలు తయారు చేశారు. అనంతరం ప్రభుత్వానికి అందజేశారు. దీంతో కరువు మండలాలపై ప్రభుత్వం త్వరలోనే జాబితాను విడుదల చేయనుంది. కాగా ఈ సంవత్సరం రబీలో లోటు వర్షపాతం నమోదు అయింది. సరైన సమయంలో వర్షాలు పడలేదు. పంటల దిగుబడులు సైతం చాలా తగ్గిపోయాయి. రబీ సీజన్ ముగిసిన నేపథ్యంలో కరువు పరిస్థితులపై అధికారులను ప్రభుత్వం నివేదికలు కోరింది. పంటల సాగు విస్తీర్ణం, దిగుబడి, వర్షపాతం నమోదు, భూమిలో తేమశాతం, భూగర్భజలాల పరిస్థితి వంటి కేంద్రప్రభుత్వ మార్గదర్శకాల అనుగుణంగా కరువు మండలాలను అధికారులు ఎంపిక చేశారు. మొత్తం 51 మండలాల్లో కరువు పరిస్థితులు ఉన్నట్లు నివేదికలు రెడీ చేసి ప్రభుత్వానికి అందజేశారు.

# అమెరికా పర్యటనకు రాహుల్



**ఢిల్లీ:** ఏప్రిల్ 19 నుంచి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అమెరికాలో పర్య టించనున్నట్లు సమాచారం. కాంగ్రెస్ అగ్రనేత, లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అమెరికా పర్యటనకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ మేరకు పార్టీ వర్గాలు వెల్లడించినట్లు ఆంగ్ల మీడియాల్లో కథనాలు వస్తున్నాయి. ఆ కథనాల ప్రకారం.. ఏప్రిల్ 19 నుంచి రాహుల్ అగ్రరాజ్యం అమెరికాలో పర్యటిస్తారు. ఈసందర్భంగా ఆయన బ్రౌన్ యూనివర్శిటీని సందర్శిస్తారు. బోస్టన్‌లో ప్రవాస భారతీయులతోనూ ఆయన భేటీ అయ్యే అవకాశం ఉంది. అయితే, ఆయన యూఎస్‌లో ఎన్ని రోజులు పర్యటిస్తారనేది తెలియదు. అంతేకాక.. దీనిపై పార్టీ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన లేదు. ఇక, గతేడాది సెప్టెంబరులో మూడ్రోజులు రాహుల్ యూఎస్‌లో పర్యటించారు. ఆ సమయంలో ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో రిజర్వేషన్లు, భారత్‌లో మత స్వేచ్ఛ వంటి అంశాలపై రాహుల్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ప్రస్తుతం భారత్‌లో ఆదివాసీలు, దళితులు, ఓబీసీలకు సరైన ప్రాధాన్యం దక్కడం లేదని రాహుల్ అన్నారు. అప్పటివరకు అభివృద్ధిలో వారి భాగస్వామ్యం కూడా అంతంతమాత్రంగానే ఉంటుందని, దేశంలో అన్నివర్గాల వారికీ పారదర్శకంగా అవకాశాలు లభించే పరిస్థితులు వచ్చిన తర్వాతే రిజర్వేషన్ల రద్దు గురించి తమ పార్టీ ఆలోచిస్తుందన్నారు. ఇక, సిక్కులను ఉద్దేశిస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారితీశాయి. భాజపా ఆయన మాటలను ఖండించింది. విదేశాల్లో భారత్ పరువుతీస్తున్నారని మండిపడింది. సిక్కులను ఉద్దేశిస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా.. భాజపా మద్దతున్న ఒక గ్రూప్ దిల్లీలోని సోనియాగాంధీ నివాసం వెలుపల నిరసనలు సైతం తెలియచేసింది.

# విశాఖ ఉక్కులో కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె



(మొదటి పేజీ తరువాయి)

కాంట్రాక్ట్ కార్మికులను పోలీసులు అడ్డుకోవడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. కాంట్రాక్ట్ కార్మికులను బలవంతంగా అరెస్ట్ చేశారు.

**చంద్రబాబు, పవన్ ఎక్కడున్నారు?**

'కాంట్రాక్ట్ కార్మికులకు తొలగిస్తే సహించం. తొలగించిన వారిని వెంటనే విధుల్లో తీసుకోవాలి. స్టీల్ ప్లాంట్ ను ఆదుకుంటామన్న పవన్ కళ్యాణ్ చంద్రబాబు ఎక్కడున్నారు. మాతో మీకు అవసరం తీరిపోయింది కాబట్టి నోరు మెదపడం లేదా?, స్టీల్ ప్లాంట్ టెంట్ దగ్గరికి వచ్చి పవన్ కళ్యాణ్ చంద్రబాబు మద్దతు తెలిపిన విషయాన్ని మర్చిపోయారా? కార్మికుల కష్టాలు మీకు కనిపించడం లేదా?. త్వరలోనే నిరవధిక సమ్మెకు దిగుతాం' అంటూ క్రాంట్రాక్ట్ కార్మికులు హెచ్చరించారు.

విశాఖ సమాచారమ్
శనివారం 29-3-2025

# ప్లాస్టిక్ బాంబుపై మానవాళి

ప్రపంచ పర్యావరణానికి ప్రజారోగ్యానికి ప్లాస్టిక్ తీవ్ర హాని కల్పిస్తుంది. జీవజాతి మనుగడనే ప్రశ్నార్థకంలోకి నెట్టేస్తున్న ప్లాస్టిక్ భూతం, మానవ జీవితాల్లోకి శరవేగంగా చొచ్చుకొస్తోంది. ఇంగ్లాండులోని లీడ్స్ యూనివర్సిటీ పరిశోధకులు గత సంవత్సర అధ్యయనం ప్రకారం ప్రపంచంలో ఏటా 25.1 కోట్ల టన్నుల ప్లాస్టిక్ తయారవుతుంది. ఇలా పుట్టుకొచ్చిన ప్లాస్టిక్ వ్యర్థాల నియంత్రణ, సమర్థ నిర్వహణకు ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కంకణబద్ధం కావలసిన సమయం ఆసన్నమైంది.

ప్రపంచాన్ని ప్లాస్టిక్ కాలుష్యంతో ముంచి వేయటంలో అనేక దేశాల కంటే భారతదేశం ప్రపంచంలో మొదటి స్థానంలో ఉందని ప్రఖ్యాత నేచర్ జర్నల్ తాజా అధ్యయనం తేల్చింది. ఇలా ఆ తర్వాత స్థానాల్లో నైజీరియా, ఇండోనేషియా, చైనాలు ఆ పాపాన్ని పంచుకుంటున్నాయని, ఈ అధ్యయనాన్ని నిర్వహించిన లీడ్స్ విశ్వ విద్యాలయం పరిశోధకులు వెల్లడిరచారు. మానవాళికే కాకుండా ఇతర జంతు జాలానికి, పర్యావరణానికి కూడా ప్లాస్టిక్ పెనుముప్పుగా పరిణమిస్తోంది. ఈ పాపంలో మన వాటా ఎక్కువగా ఉన్నందున తగ్గించుకోవడానికి మనం ఏం చేయాలో ఆలోచించుకోవాల్సిన తరుణమిది.

ప్రపంచంలో అత్యంత అధికంగా ప్లాస్టిక్ ఉత్పత్తి చేసేవి ధనిక దేశాలు. కానీ వాటిలో ఒక్కటి కూడా టాప్ 90 కాలుష్యకారక దేశాల జాబితాలో లేవు. సుమారు 69 శాతం ప్రపంచ ప్లాస్టిక్ కాలుష్యం కేవలం 20 దేశాల నుంచి వస్తోంది. ఇవన్నీ అభివృద్ధి చెందుతున్న, పేద దేశాలే కావడం గమనార్హం! ధనిక దేశాల్లో ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ వాటి నిర్వహణ సమర్థంగా సాగుతుండటమే ఇందుకు కారణంగా ఈ అధ్యయనం అభిప్రాయపడుతోంది. భారతదేశంలో ఏటా 58 లక్షల టన్నుల ప్లాస్టిక్‌ను కాలుస్తున్నాం. మరో 35 లక్షల టన్నుల ప్లాస్టిక్‌ను పర్యావరణం (భూమి, నీరు, గాలి)లోకి వదులుతున్నాం. మొత్తంగా ఏడాదిలో సుమారు 90 లక్షల టన్నులకు పైగా ప్లాస్టిక్ భూతాన్ని ఈ ప్రపంచం మీదకు వదులుతున్నాం. ఆ మధ్య మన దేశ అత్యున్నత న్యాయస్థానం ఆవేదన వ్యక్తం పరచినట్లు.. మనం ప్రస్తుతం ప్లాస్టిక్ బాంబుపై కూర్చున్నాం! ఆ మహమ్మారిని కట్టడి చేయడంలో విఫలమైతే అణ్వస్త్రాలను మించిన ముప్పును భావితరాలు ఎదుర్కోక తప్పదు. ఇంతటి దుర్భర దుస్థితి దాపురించకూడదంటే? ఎవరికి వారు ప్లాస్టిక్ వినియోగాన్ని వీలైనంత మేరకు తగ్గించాలి. సంబంధిత వ్యర్థాల సద్వినియోగం పట్ల పాలకులు ప్రతి ఒక్కరూ నేను సైతం అంటూ సామాజిక బాధ్యతతో శ్రద్ధ వహించాలి.

ప్రపంచాన్ని వణికిస్తున్న ఈ తీవ్రత దృష్ట్యా ప్లాస్టిక్ భూతానికి ముగింపు పలికేందుకు జరిగిన అంతర్జాతీయ ఒప్పంద రూపకల్పనకు 170కి పైగా దేశాలు చర్చలు జరిపాయి. కానీ ఏకాభిప్రాయం కుదరలేదు. ఆ ఒడంబడిక చిత్తశుద్ధితో ఎంత త్వరగా సాకారమైతే ప్రపంచ జీవజాతుల, మానవ మనుగడకు అంత మంచిది. ప్రమాదకర ప్లాస్టిక్ ప్రత్యామ్నాయాలపై పరిశోధనలకు చేయూత నివ్వాలి. ప్లాస్టిక్ వ్యర్థాలతో రోడ్ల నిర్మాణం ద్వారా ఖర్చు తగ్గిస్తూనే, నాణ్యతను పెంచవచ్చనే విదేశాల అనుభవాలతో పాఠం నేర్చుకోవాలి. ప్లాస్టిక్ వ్యర్థాలతో డీజిల్ ఉత్పత్తిని ప్రోత్సహిస్తే, వ్యర్థాలను సంపద సృష్టికి వినియోగించుకోవచ్చు. ఇలా ప్లాస్టిక్ నియంత్రణ నియమాలన్నీ సక్రమంగా అమలయ్యేలా చేస్తూ దాని వాడకం వల్ల కలిగే సమస్యలపై ప్రజలలో అవగాహన పెంచాలి. ప్రపంచ, దేశీయ పాలకులు, పాలితులు చిత్తశుద్ధితో కంకణబద్ధులైతేనే మెరుగైన ఫలితాలు సాధ్యమవుతాయి. సాధ్యమైన మేరకు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం, ప్లాస్టిక్ వ్యర్థాలను బహిరంగంగా పారేయకుండా సంఘటన నిర్వహణకు అందజేయటం ప్రతి ఒక్కరి బాధ్యత. ఇలా ప్లాస్టిక్ బాంబు నుండి భావితరాల కు ప్రభుత్వాలు రక్షణ కల్పించడానికి ప్లాస్టిక్ వ్యర్థాల నియంత్రణ, సమర్థ నిర్వహణకు ప్రభుత్వాలు ఇన్నాళ్ల నిర్లక్ష్యం వీడి చిత్తశుద్ధితో కంకణబద్ధం కావలసిన తరుణమిది. పొంచి ఉన్న ప్రమాదాన్ని గ్రహించి అవగాహన, చైతన్యం పెంచుకొని ప్రజలు కూడా మేము సైతం అంటూ బాధ్యతగా వ్యవహరించాలి.

## పంచాంగం

శనివారం 29-3-2025
క్రోధి నామ సంవత్సరము
ఉత్తరాణాయణం, శిశిరరుతువు
ఫాల్గుణ మాసం

తిథి : బ. అమావాస్య సా. 4.28
నక్షత్రం : ఉత్తరాభాద్ర సా. 7.26
వర్జ్యం : ఉ. 6.40 ల 8.05

## మీ కలాన్ని సంధించండి

కథలు, కవితలు, సాహిత్య, రాజకీయ విశ్లేషణలు, వ్యాసాలు, ప్రత్యేక కథనాలు, సందర్భోచిత కథనాలు... ఇలా ఏదైనా సరే.. రాసే ఆసక్తి ఉన్న వారు పంపవచ్చు. మీకు 'విశాఖ సమాచారమ్' దినపత్రిక చక్కటి వేదికగా నిలుస్తుంది. బాగున్న రచనలను మీ పేరు , ఫోటోతో సహా ప్రచురిస్తాము.

**మీ రచనలు పంపించవలసిన ఈమెయిల్ అడ్రస్**
**vspnews4@gmail.com**
**వాట్సాప్ నంబర్ : 9100986585.**

# విలక్షణ శైలి.. ఆయనే పతంజలి



నేడు జయంతి సందర్భంగా

ఆయనదో విలక్షణమైన శైలి. భాషలో, వస్తువులో తొణికిసలాడే వ్యంగ్యం. సమాజాన్ని, మనుషులను తలకిందులు చేసి చూడాలనే తత్వం. మనుషుల్లోని వైవిధ్యాన్ని, విలక్షణతని తనదైన ప్రత్యేక కెమెరాతో చూసే చూపు. తనకోసం మాత్రమే రచనలు చేస్తాను అని నిక్కచ్చిగా చెప్పగల ధైర్యం. అపారమైన పాండిత్యం, ఆ పాండిత్యాన్ని మాండలిక భాషలో సొగసుగా వ్యక్తం చేయగల ప్రతిభ. అతనే కె.ఎన్.వై. పతంజలి. ఏ కొద్ది సాహిత్యాభిమానం ఉన్నవారికైనా పతంజలి గురించి తప్పక తెలిసే ఉంటుంది. మనుషుల వ్యక్తిత్వాల్లోని వైరుధ్యాన్ని అన్ని కోణాల నుంచి చిత్రించిన రచయత ఆయన. పతంజలి అంటే జర్నలిస్టు, కథ, నవలా రచయిత. కాలమిస్టు. వ్యాస రచయిత. వైద్యుడు. వ్యంగ్యానికి పెట్టింది పేరు.

పతంజలి పూర్తి పేరు కాకర్లపూడి నారసింహ యోగ పతంజలి. విజయనగరం జిల్లాలోని అలమండలో మార్చి 29, 1952న జన్మించారు. చిన్ననాడే తండ్రి వద్ద ఆయుర్వేద శాస్త్రాన్ని నేర్చుకున్నాడు. 11వ ఏటనే రచనా వ్యాసంగాన్ని ప్రారంభించాడు. 1975 నుంచి 84 వరకు ఈనాడులో, 1984 నుంచి 90 వరకు ఉదయం పత్రికల్లో పాత్రికేయ వృత్తిలో పనిచేశారు. తర్వాత ఆంధ్రజ్యోతి, ఆంధ్రప్రభ, ఆంధ్రభూమిలో ముఖ్యమైన బాధ్యతలు చేపట్టారు. టి.వి - 9లో, సాక్షి పత్రిక ఆవిర్భావంలో ఎడిటర్ గా విధులు నిర్వహించారు. సిందూరం సినిమాకు మాటలు రాశారు. అందుకు వీరికి నంది పురస్కారం కూడా లభించింది. వీరు నవలలు, కథలతో పాటు కొన్ని ప్రత్యేకమైన రచనలు కూడా చేశారు.

నవలలు- పెంపుడు జంతువులు, ఖాకీవనం, పిలక తిరుగుడు పువ్వు, గోపాత్రుడు, వీర బొబ్బిలి, ఒక దెయ్యం ఆత్మకథ, అప్పన్న సర్దార్, మేరా భారత్ మహాన్, రాజుల లోగిళ్లు..

కథలు- వేట కథలు, జ్ఞాపక కథలు, శభాషో మోపాసా.. వంటి సంపుటాలు.

ఇతర రచనలు - పతంజలి భాష్యం, గెలుపు సరే బతకడం ఎలా...

వీరు మరణించిన తర్వాత స్నేహితులు, అభిమానులు, సహోద్యోగులు కలిసి వారి అనుభూతుల్ని, అభిప్రాయాలను, వీరి రచనల్లోని గొప్పతనాన్ని వ్యాసాల రూపంలో పుస్తకంగా తెచ్చారు. అదే పతంజలి తలపులు.

పతంజలి రచనలను అర్థం చేసుకోవాలంటే 1970 ల నుంచి సమాజాన్ని అవగతం చేసుకోవాలి. తెలుగునేలపై వచ్చిన సాంస్కృతిక, రాజకీయ మార్పులను, ఉద్యమాలను తెలుసుకోవాలి. 1975లోని ఎమర్జన్సీ నుంచి అన్నమాట. బాల్యంలో భూస్వాముల ఇళ్లల్లోని గొప్పలు, యవ్వనంలో విశాఖతీరంలోని అనుభవాలు, ఉత్తరాంధ్రలోని ఉద్యమాల ప్రభావం అన్నీ వీరి రచనల్లో అంతర్గతంగా కనిపిస్తాయి. ఇంకా శ్రీశ్రీ, పురిపండ అప్పల స్వామి, కారా మేస్టారు, రావి శాస్త్రి, చెకోవ్, మొపాసా, గురజాడ, చాసో, ఆస్కార్ వైల్డ్, వేమన, సెర్వాంటిజ్ ల ప్రభావం కూడా ఉంది. అందుకే చమత్కారం, వ్యంగ్యం, విలక్షణమైన వచనశైలి వీరి సొంతం. పాత్రచిత్రణ, సన్నివేశాల కల్పన, సంభాషణలు... సరికొత్తగా తటిల్లతల్లా మెరుస్తుంటాయి. ప్రతి రచనలో అంతుచిక్కని లోతు, అర్థం చేసుకున్నంత విస్తృతి కనిపిస్తుంది.

ఖాకీవనంలో ప్రభుత్వం తరపున ప్రజలపై దౌర్జన్యం చేసే వాళ్లే అధికార వర్గాన్ని నిలదీయడం చూడొచ్చు. వీరబొబ్బిలిలో రాజుల లోగిళ్లలో పుట్టి పెరిగి వారి మాటలతో పాటు, మర్యాదలు, పెంకితనాన్ని నేర్చుకున్న గ్రామసింహం (కుక్క) తీరును వ్యంగ్యంగా అర్థం చేసుకోవచ్చు. నావల్ల ఈ దివాణానికి కళ, కాంతి అని విర్రవీగే కుక్క అది. చూపున్న పాట కథలో గుడ్డివాడు తన ఫ్లూటులో విప్లవాన్ని ఉద్దేశించే పాట పాడితే... అది పోలీసును ఎలా భయపెడుతుందే వివరించాడు. అడల్ట్ స్టోరీలో- పువ్వును ముద్దు పెట్టుకుంటే పువ్వాడి, పెళ్ళాన్ని ముందు పెట్టుకుంటే కుంకుమ పెదాలకు అంటుకుంటాయి అన్నాడు. నువ్వే కాదు నవలికలో డబ్బు మనుషుల్ని ఎలాంటి దైన్యానికి దిగజారుస్తుందో తెలియజేశాడు. న్యాయం, మీడియా అన్నీ వ్యవస్థలూ అవినీతి మయం అయ్యాయని రుజువు చేశాడు. అసలు పతంజలి సృష్టించిన పాత్రలు వెక్కిరిస్తాయి, చమత్కారంగా సంభాషిస్తాయి, పాఠకుల గుండెలను బరువెక్కిస్తాయి, తర్కంతో మెప్పిస్తాయి. మానవ స్వభావం, ఆశలు, నిరాశలు, అన్నీ వ్యవస్థీకృతం అని చెప్పకనే చెప్తాయి. మనల్ని మేడిపండు వొలిచినట్లు వొలిచి మనలోని లోపాల్ని పురుగుల్లా బైటకు చూపెడతాయి.

తన రచనల గురించి పతంజలి స్వయంగా చెప్తూ- నేను వ్యంగ్యాన్ని ప్రత్యేకంగా రాయను, మనుషుల్లో ఉన్నదే రాస్తాను అంటారు. చెడును. దుర్మార్గాన్ని వెక్కిరిస్తే నాకు సంతోషం. వ్యంగ్యంలో నా బాధ, క్రోధం ఉంటాయి. రాయకుండా ఉండలేను కాబట్టే రాస్తున్నాను అని చెప్పుకున్నారు. పతంజలి రచనలు చదవడానికి ధైర్యం కావాలి. లోకం మీద కసితో కురిసే వారి వాక్యాల కత్తుల బోనులోకి ప్రవేశించాలి అంటే ఆ పదును తట్టుకోగలగాలి. వీరికి రావిశాస్త్రి పురస్కారం, చాసో పురస్కారం లభించాయి. వీరి రచనల మొత్తాన్ని మనసు ఫౌండేషన్ రెండు సంపుటాలుగా తెచ్చింది. వీరి నవలికలను నాటకాలుగా మలచి ప్రదర్శించారు.

ఇలా మనిషిలోని హిపోక్రసీని, సమాజంలోని అంతర్గత విలువల పతనాన్ని రచనల్లో చెప్పిన పతంజలి అనారోగ్యంతో 2009లో మరణించారు. ఆయన గురించి ఆయన ఆప్తులు, తోటి రచయితలు ఎన్నో జ్ఞాపకాలను పంచుకున్నారు. "మిత్రులందరికీ ఆయన స్మృతి ఒక దవనం. అది పరిమళిస్తూ ఉంటూ నెమరు వేసుకునే కొలది బాధగానూ, రుచిగానూ, శక్తి నింపేట్టుగానూ, నిలబెట్టేట్టుగానూ ఉంటుంది" అన్నారు ప్రముఖ కవి శివారెడ్డి. "ఏదో ఒక పేజీ చదివాక, మన రక్తంలోకి జొరబడాతడు" అని ఆయన రచనల్లోని గొప్పతనాన్ని చెప్పారు అరసవిల్లి కృష్ణ.

చివరిగా పతంజలి 1984లో జరిగిన ఎన్నికల సందర్భంగా రాసిన వాక్యాలను గుర్తుచేసుకుందాం. ఎందుకంటే అవి ఇప్పటికీ వాస్తవాలు కనుక-

"మనమీద మనకు కొంత అసహ్యం వేస్తుంది.
మన మీద మనకు కొంత రోత పుడుతుంది.
మన బుద్ధి గడ్డి తింటున్నదని తెలిసి సిగ్గేస్తుంది.
ఎన్నికల పతాకాలు విప్పేసిన తర్వాత, గుడారాలు పీకేసిన తర్వాత పట్టాభిషేక మహోత్సవం ముగిసిన తర్వాత తుపాకి ఇంకా మనకే గురిపెట్టి ఉందని తెలుస్తోంది.
మన ఓటే మనల్ని కాటేసిందని తెలుస్తుంది
ఈ మొహం మరో అయిదేళ్ల వరకూ ఎవరికీ చూపించలేం గదా అనిపిస్తుంది. దిగులేస్తుంది.

- డా. ఎ. రవీంద్రబాబు

# కామాంధులకు కళ్ళెంవేయాలి



కామాంధులు రెచ్చిపోతున్నారు. మహాత్ముడు "మహిళ అర్ధరాత్రి స్వేచ్ఛగా తిరిగిన రోజు నిజమైన స్వాతంత్ర్యం వస్తుందని" చెప్పిన మాట ఎప్పటికి వస్తుందో, అసలు రాదో అనే అనుమానాలు కలుగుతున్నాయి.రాజధాని ఢిల్లీ నుంచి గల్లీ వరకూరోజూ ఎక్కడో అక్కడ మహిళలపై అత్యాచారం, లైంగికవేధింపులు వార్తలు వస్తునే ఉన్నాయి. ఢిల్లీలో నిర్భయ ఉదంతం జరిగి సంవత్సరాలు అవుతున్నా అత్యాచారాలు ఆగలేదు. తెలుగు రాష్ట్రాల్లో కామాంధులు మరీ రెచ్చిపోతున్నారు. పోలీస్ కమిషనర్గా సజ్జనార్ ఉన్నప్పుడు హైదరాబాద్ లో ఒక యువతిపై జరిగిన అత్యాచారం సందర్భంగా నలుగురు నిందితుల్ని ఎన్కౌంటర్ చేసారు.దీనిపై ప్రజలు హర్షించారు. కాని చట్టపరంగా శిక్షించాలి గాని ఇలా ఎన్కౌంటర్ లతో ముగింపు పలకడం నేరమని మేధావులు విమర్శించారు.కాని ఇలాంటి కామాంధులు తగిన శిక్ష పడిందని ప్రజలు పోలీసులకు జేజేలు పలికారు. అయినా అత్యాచార యత్నాలు ఆగడం లేదు . ఈ వారంలో మూడు సంఘటనలు సంచలనం రేపాయి.హైదరాబాద్లో ఓ బాలివుడ్ నటిని ప్రారంభోత్సవానికి పిలిచి ఆమెపై అత్యాచారయత్నానికి పాల్పడ్డారు.మరో ఘటనలో ఎంఎంటీఎస్ (స్థానిక)రైలులో యువతిపై అత్యా చారయత్నం జరిగింది.ఇదిలాఉండగా విశాఖ పట్టణంలో ఓ చిన్నారిపై కామ పిశాచి అత్యాచారం చేసాడు.ఒకసారి కాదు ఈ దుర్మార్గుడు ఆ బాలికపై పలుమార్లు లైంగిక వేధింపులకు పాల్ప డ్డాడని పోలీసులు దర్యాప్తులో తేలింది. ఆదివారం సాయంత్రం ఒక యువతి సికింద్రాబాద్ నుంచి మేడ్చల్ వెళుతున్నది.ఆమెతో ఉన్న ఇద్దరు మహిళలు అల్వాల్లో దిగిపోయారు.ఒంటరిగా ఉన్న యువతి వద్దకు అదే కంపార్టెంట్ లో ప్రయాణిస్తున్న వ్యక్తి వచ్చి గట్టిగా పట్టుకుని తనతో రమ్మన్నాడు.భయంతో ఆయువతి కదులుతున్న రైలులోంచి దూకేసింది. ఆ తరువాత ఆమెను ఆస్పత్రిలో చేర్చారు. ప్రాణాపాయం నుంచి తప్పించుకుంది. నిందితుడి కోసం పోలీసులు సీసీ కెమెరాల సాయంతో గాలిస్తున్నారు.

మరో ఘటనలో ఓ బాలివుడ్ నటిపై ఇద్దరు యువకులు అత్యాచారయత్నం చేసారు.ఓ షాప్ ఓపెనింగ్ కోసం పిలిచారు.ఆమె అపార్టెంట్ లో రాత్రి స్టే చేయడంతో అమెను అసభ్యంగాతాకుతూ ప్రవర్తించారు.నోట్లో గుడ్డలు కుక్కి లైంగికంగా వేధించారు.చివరకు ఆమె 100 కు కాల్ చేయడంతో నిందితులు పారిపోయారు.

ఇటీవల ఢిల్లీలో ఒక విదేశీ మహిళపై అత్యాచారం జరిగింది.ఇది ఘోరాతి ఘోరమైన సంఘటన.ఇతరదేశాల నుంచి భారతదేశానికి ఇక్కడి సంస్కృతి నచ్చి చూడాలని వచ్చిన పర్యాటకరాలిపై అత్యాచారం చేయడం మన దేశాన్ని మనం అవమానించు కోవడమే.ఒంటరిగా కనిపిస్తే వారు ఆడదైతే చాలు వయస్సుతో సంబంధం లేకుండా అత్యాచారానికి పాల్పడుతున్నారు.విశాఖ ఉదంతమే దీనికి తాజా ఉదాహరణ.

ప్రభుత్వం,పోలీసు వారు ఎన్ని కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నా మహిళలు పట్ల లైంగిక వేధింపులు తగ్గడంలేదు. ఆడవారికి భయం ఉన్నంత కాలం దౌర్జన్యాలు,వేధింపులు తప్పవు. వాటిని ధైర్యంగా ఎదుర్కోవాలి.ఎప్పుడు ఏమి జాగర్త తీసుకోవాలో అవగాహనతో అప్పటికి అది అమలుచేస్తూ నిలబడాలి. మహిళా కంపార్టెంట్ లో పోలీసు నిఘా పెట్టాలి.అలాగే నేరం జరుగుతుందని అనుమానం ఉన్న చోట పోలీసులు నిఘా పెంచాలి.ఆడపిల్లల్ని టీజ్ చేస్తున్న యువకులకు హెచ్చరికలు జారీ చెయ్యాలి.రౌడీ గ్యాంగ్ లపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. ఆటోలు, టాక్సీలు సమాచారంపై కూడా నిఘా ఉండాలి. పోలీసుశాఖను పటిష్టం చేసి మహిళా పోలీసులతో షీటీంలను ఏర్పాటు చేయాలి. ఫ్రెండ్లీ పోలీసులుగా మహిళలకు అండగా ఉంటామని ప్రచారం చెయ్యాలి. ఎవరికి ఆపద వచ్చినా క్షణంలో అక్కడికి చేరేలా పోలీసు యంత్రాంగం సిద్ధంగా ఉండాలి. మహిళల రక్షణకు కావలసిన కఠిన చట్టాలను ప్రభుత్వాలు అమలులోకి తీసుకురావాలి. కామాంధులకు, కీచకులకు సింహస్వప్నంగా మారాలి. అత్యాచారకేసులను ప్రత్యేక కోర్టులువేసి నిందితులను త్వరగా శిక్ష పడేలా చూడాలి.

మహిళలను కేవలం శృంగార వస్తువులుగా చూసే ధోరణి సమాజంలో పెరిగిపోయింది. పురుషులతో సమానంగా మహిళలు అంతరిక్షానికి కూడా వెళుతున్నా వారిపై చులకన భావం పోవడం లేదు. ఇది పోవాలంటే ముందు కుటుంబం నుంచే మార్పు రావాలి.ఆడమగ పిల్లలను సమానంగా వివక్ష లేకుండా పెంచాలి.చిన్నతనం నుంచే సోదరీమణులాగా ఇతర మహిళలపై కూడా ఉండేలా తల్లిదండ్రులు మానసికంగా సిద్ధం చేయాలి.మహిళల అభివృద్ధిని ప్రభుత్వాలు ప్రచారం చెయ్యాలి. కామాంధులు పడిన శిక్షలను పెద్ద ఎత్తున ప్రచారం చెయ్యాలి.పోలీసు,ఇతర నిఘా సంస్థలలో మహిళలకు సముచిత స్థానం పెంచి వారిలో ఆత్మవిశ్వాసం, ఆత్మస్థైర్యం పెంచాలి.అప్పుడే లైంగిక వేధింపులు,అత్యాచారాలు తగ్గుతాయి.



(యం.వి.రామారావు,
ప్రత్యేక ప్రతినిధి)

# మేలు ఒకరిది...మర్యాద మరొకరిది



అదొక ఆశ్రమం. అక్కడ ఓ జెన్ గురువు ఉన్నారు. ఆయన ఎంతో సరదా మనిషి. ఆయనకు కోపమంటే ఏంటో తెలీదు. ఆయన దగ్గర ఎందరో ఎన్నెన్నో మంచి మంచి విషయాలు తెలుసుకున్నారు. అందుకే ఆయన దగ్గర శిష్యరికం చేయడానికి యువకులు ఎంతో ఉత్సాహం చూపేవారు.

ఓరోజు ఆయన అవీ ఇవీ చెప్తూ వచ్చారు. అప్పుడు ఓ శిష్యుడు లేచి నిల్చుని గురువుగారూ, మీకు నచ్చిన ఓ కథ ఏంటో చెప్పరా అని అడిగారు.

ఆ గురువుగారు తనకు "గుర్రం - మేక" కథ ఇష్టమన్నారు.

వెంటనే శిష్యులు గుర్రం - మేకా ఆ కథేంటో చెప్పగలరు అని శిష్యులందరూ ముక్తకంఠంతో అడిగారు.

గురువుగారు ఆ కథ చెప్పడం మొదలుపెట్టారు.

అనగనగా ఓ ఊరు. ఆ ఊళ్ళో ఉంటున్న ఓ ధనికరైతు దగ్గర ఓ గుర్రం, ఓ మేక ఉన్నాయి. వాటి మధ్య మంచి స్నేహమే ఉండేది. ఓరోజు గుర్రానికి వైరస్ సోకి అనారోగ్యం చేసింది. దానికి చికిత్స చేయించడం కోసం రైతు ఓ వైద్యుడిని రప్పించాడు. వైద్యుడు వచ్చి గుర్రాన్ని పరీక్షించి తాను మూడు రోజులు వచ్చి మందులు ఇస్తాను. ఆ మందులు తీసుకున్న తర్వాత గుర్రం కోలుకుని లేచి నిల్చుంటే సరి, లేకుంటే దాని కథ ముగిసినట్టే, చంపేయడం తప్ప మరో మార్గం లేదని చెప్పి ఆ రోజుకు అవసరమైన మందులు ఇచ్చి వెళ్ళిపోయాడు వైద్యుడు.

ఈ మాటలన్నీ దగ్గర్లోనే ఉన్న మేక విన్నాది.

మరుసటి రోజు వైద్యుడు వచ్చాడు. గుర్రానికి అవసరమైన మందు ఇచ్చి వెళ్ళాడు. అనంతరం మేక గుర్రం దగ్గరకు వెళ్ళి లేచి అడుగులు వెయ్యి మిత్రమా, లేకుంటే నిన్ను చంపేస్తారు అని చెప్పింది.

మూడో రోజు వైద్యుడు వచ్చాడు. మందు లిచ్చాడు. ఈరోజు మందులు తీసుకున్న తర్వాత కూడా గుర్రం లేచి నడవలేదంటే దాన్ని చంపేయాల్సిందే, లేకుంటే దాని వైరస్ చుట్టుపక్కలంతా వ్యాపించి మనుషులకు కూడా తీవ్రఅనారోగ్యం చేస్తుందన్నాడు వైద్యుడు.

వైద్యుడు వెళ్ళిన తర్వాత మేక గుర్రం దగ్గరకు వచ్చి మిత్రమా, ఆరునూరైనా సరే నువ్వీరోజు లేచి నడవక తప్పదు...నడవడానికి ప్రయత్నించు... లేకుంటే నీ ప్రాణానికి ప్రమాదం...అంటూ గుర్రంలో ఆత్మవిశ్వాసం కలిగించింది.

మేక మాటలతో గుర్రం మెల్లగా లేచి నిలవడంతోపాటు తన యజమాని తన దగ్గరకు వస్తున్నాడని తెలిసి నడవడమేకాదు పరుగెత్తడం మొదలుపెట్టింది. ఆ దృశ్యం చూసి రైతు ఆనందించాడు.

ఆ మరుక్షణమే రైతు వైద్యుడిని పిలిపించాడు.

"ఆశ్చర్యం... మీ మందులకు నా గుర్రం కోలుకుంది. ఇందుకు గాను మీకు విందు ఇవ్వబోతున్నాను, ఈ మేకను కోసి. దాంతో రుచికరమైన వంటకాలు చేయిస్తాను సరేనా" అన్న రైతు ఆనందాన్ని చెప్తూ గురువుగారు కథ ముగించారు.

ఆ తర్వాత గురువుగారు, శిష్యులతో చూశారా, ఈ కథలో గుర్రం ఆరోగ్యం నమయవడంలో వైద్యుడి పాత్రకన్నా మేక పాత్రే ఎక్కువ. అది గుర్రాన్ని ప్రోత్సహించిన విషయం, దానిలో నింపిన ఆత్మవిశ్వాసం మరవలేనివి. కానీ రైతు ఈ విషయాన్ని తెలుసుకోక వైద్యుడి వల్లే తన గుర్రం కోలుకుందనుకుని మేకను బలివ్వడానికి నిర్ణయించుకున్నాడు. ఈ ప్రపంచంలో ఎవరి వల్ల మేలు జరిగిందో వారి కన్నా ఆ మేలుకి చేరువలో ఉన్న వారికే ఎక్కువ మర్యాద లభిస్తుందని తెలుసుకోవాలన్నారు.

- యామిజాల జగదీశ్

## చరిత్రలో ఈ రోజు (మార్చి 29)

**సంఘటనలు:**

1857: ఆవు కొవ్వుతో తయారుచేసిన తూటాను వాడేందుకు నిరాకరించి మంగళ్ పాండే అనే సైనికుడు ఒక బ్రిటిషు అధికారిని కాల్చి చంపాడు. మొదటి భారత స్వాతంత్ర్య పోరాటానికి నాంది ఇది.

1982: తెలుగుదేశం పార్టీ స్థాపన, తెలుగు సినిమా నటుడు నందమూరి తారక రామారావు స్థాపించాడు.

**జననాలు:**

1790: అమెరికా మాజీ అధ్యక్షుడు జాన్ టేలర్.

1944: బి.వసంత, తెలుగు సినిమా నేపథ్య గాయని

1950: ప్రసాద్ బాబు , తెలుగు ,తమిళ, చిత్ర నటుడు.

1952: కె.ఎన్.వై.పతంజలి, తెలుగు రచయిత, పత్రికా సంపాదకులు

**మరణాలు:**

1932: కొప్పరపు సోదర కవులు, కొప్పరపు వేంకట సుబ్బరాయ కవి, తెలుగు సాహిత్య అవధానంలో పేరొందిన జంట సోదర కవులు.

1942: తుంగల చలపతిరావు , రంగస్థల నటుడు, తొలితరం సినిమా నటుడు .

1953: జమలాపురం కేశవరావు, నిజాం నిరంకుశ పాలనను ఎదిరించిన వ్యక్తి

2016: జయకృష్ణ, భారతీయ సినిమా నిర్మాత.

# వైసీపీ మండల అధ్యక్షుడిగా బిడిజన



కొయ్యూరు, (విశాఖ సమాచారమ్):- వైసిపి పార్టీ మండల అధ్యక్షుడిగా బిడిజన అప్పారావు నియమించినట్లుగా పార్టీ నేతలు తెలిపారు. పార్టీ మండల అధ్య క్షుడిగా నియమించినందుకు బిడి జన అప్పారావు పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ఆదేశాల మేరకు మండలంలో పార్టీని బలోపేతం చేస్తానని నేతలు కార్యకర్త లు అందర్నీ ఒక తాటిపైకి తీసుకువచ్చి పార్టీని ముందుకు నడిపిస్తానన్నారు. ఈ పదవి అప్పగించినందుకు పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

# రైతులకు సకాలంలో విత్తనాలను అందించాలి

### రాష్ట్ర శాసన సభాపతి అయ్యన్నపాత్రుడు



నర్సీపట్నం, (విశాఖ సమాచారమ్):- రైతులకు సకాలంలో అవ సరమైన విత్తనాలు అందించాల్సిందిగా స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు అధికారులను ఆదేశించారు. శుక్రవారం నర్సీపట్నం స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో అగ్రికల్చర్ అధికారులతో సమావేశం నిర్వహించిన ఆయన, ఉగాది తరువాత ఏరువాక ముహూర్తం ప్రారంభమయ్యే సమయానికి రైతులకు అవసరమైన విత్తనాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. నర్సీపట్నం ప్రాంతంలో ఆర్.జి.ఎల్, సాంబ మసూరి వరి విత్తనాలను రైతులకు సరఫరా చేయాలని అగ్రికల్చర్ అధికారులను ఆదేశించారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడినిచ్చే కొత్త రకాల విత్తనాలు ఉంచనున్నట్లు అధికారులు తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో రైతులకు అవసరమైన ఆధునిక వ్యవసాయ యంత్రాలు ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసి వాటిపై అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం సమగ్ర శిక్ష అధికారులతో సమీక్ష సమావేశం నిర్వ హించారు. నియోజకవర్గంలోని కేజీబీవీ జూనియర్ కళాశాలలకు నూతన భవనాల కొరకు సుమారు కోటి 20 లక్షల రూపాయల నిధులు మంజూరైనట్లు తెలిపారు. మాకవరపాలెం, వేములపూడి, నాతవరం ప్రాంతాలలో ఏప్రిల్ మొదటి వారంలో భవనాలకు శంకుస్థాపన చేయడానికి ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అధికారులు ఏడీవో శ్రీదేవి, ఎంఏఓ అప్పారావు, సమగ్ర శిక్ష అధికారులు డీఈ సుబ్బలక్ష్మి, ఈ.నరసింహారావు, ఏఈ రమణాజీ పాల్గొన్నారు.

# ధృవీకరణపత్రాలు నిజనిర్ధారణ

### మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. హేమలత దేవి

జి.మాడుగుల, (విశాఖ సమాచారమ్):- జిల్లా కలెక్టర్ ఎ ఎస్ దినేష్ కుమార్ ఆదేశాల మేరకు ఎంపికైన అభ్యర్థులు సమర్పించిన ధృవ పత్రాలును నిజనిర్ధారణ నిమిత్తము సంబంధిత విద్యా సంస్థలకు పంపించడం జరిగిందని పాడేరు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. హేమలత దేవి ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ పరిధి లో గల జిల్లాలోని పాడేరు ప్రభుత్వ వైద్య కళాశాల మరియు ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ ల యందు కాంట్రాక్ట్ మరియు అవుట్ సోర్సింగ్ పద్ధతిన ఉద్యోగ ఖాళీలును భర్తీ చేయుటకు అర్హులైన అభ్యర్థులు నుండి దర ఖాస్తులును కోరిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో ఎంపికైన అభ్యర్థులు సమర్పించిన ధృవ పత్రాలు పరిశీలనకు పంపించడం జరిగిందని, వాటిలో తప్పుడు ధృవ పత్రాలుగా ఋజువైన వారిని బ్లాక్ లిస్ట్ లో పెట్టడంతో పాటు వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ప్రిన్సిపాల్ స్పష్టం చేశారు.

# మావోయిస్టులకు వ్యతిరేకంగా గిరిజనుల ర్యాలీ




కొయ్యూరు, (విశాఖ సమాచారమ్):- మండలం లోని చీడిపాలెం పంచాయతీ పరిధిలోని మారుమూల గ్రామమైన పలకజీడి వారపు సంతలో శుక్రవారం మావోయిస్టులకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహిం చారు. వారపుసంతకు వచ్చిన గిరిజనులు ఈ ర్యాలీలో స్వచ్ఛంగా పాల్గొన్నారు.మావోయిస్టు వారోత్సవాలు వద్దు.గిరిజనుల అభివృద్దే ముద్దు' అంటూ నినాదాలు చేశారు.మావోయిస్టులారా ఎవరి కోసం ఈ వారోత్సవాలు, ఎందుకు కట్టాలి స్థూపాలు అంటూ ర్యాలీ చేశారు.

# Spoken English -13

1).But neither Krishna nor I could not understand why these things were happening to us- అయితే కృష్ణ గానీ నేను గానీ ఎందుకు ఈ విషయాలు మాకు జరుగుతున్నాయని అర్థం చేసుకోలేక పోయాము

2). "You know why Christians does eat meat , Rabi " he asked.- " " క్రిష్టియన్ ఎందుకు మాంసం తింటారో నీకు తెలుసా, రబీ' అని అతను అడిగాడు.

3). It seemed stange question to me-- ఇది నాకు వింతైన ప్రశ్నగా అనిపించింది.

4). You mean you does read that book?-- అంటే నీవు ఆ పుస్తకం చదివావా?

5). People respected me for the principles, I held. - ప్రజలు నేను గైకొనిన నియమాలను బట్టి నన్ను గౌరవించారు.

6). I would not eat cake that had egg in it- దానిలో ఎగ్ వుంటుందని కేక్ ను కూడా తినేవాడిని కాను.

By Dr.P.V.Ram, Visakhapatnam. 9553574250

ఈస్ట్ కోస్ట్ రైల్వే
ఇ-టెండరు ప్రకటన నెం. CAOCWATETCECI VSKP2025003, తేది. 25.03.2025
పని పేరు: కొత్తవలస-విజయనగరం మధ్య 4వ లైను మరియు విజయనగరం-నౌపడ మధ్యన 3వ లైను (151.70 కి.మీ): ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం & శ్రీకాకుళం జిల్లాలో రైల్వే సేకరణ చట్టం-2008 పరిధిలో ప్రైవేట్ భూమి సేకరణ, ప్రభుత్వ భూమి యొక్క అన్యాక్రాంతం మరియు స్వాధీనత ఉత్తర్వు కొరకు కాంపిటెంట్ అధారిటీ ఫర్ ల్యాండ్ అక్విజిషన్ (CALA)నకు ఫెసిలిటేషన్ ఏర్పాటు చేయుట.
సుమారు పని విలువ: ₹ 1,15,75,855.20, బయానా: ₹ 2,07,900/-. పని పూర్తి చేయు కాలం: 12 (పన్నెండు) నెలలు.
టెండరు ముగింపు తేదీ మరియు సమయం: 15.04.2025న 1200 గంటలకు.
ఇందుకు సంబంధించి మాన్యువల్ ఆఫర్లు ఇ-టెండర్లకు సంబంధించి పోస్టు / కొరియర్ / ఫ్యాక్స్ లేదా స్వయంగా తను సంస్థ లెటర్ హెడ్స్ పైన, సకాలంలో అందునట్లు పంపినప్పటికీ అంగీకరించబడవు. అట్టి అన్ని మాన్యువల్ ఆఫర్లు చెల్లుబాటు కానివిగా పరిగణించవడతాయి మరియు ఎలాంటి పరిశీలన లేకుండానే తిరస్కరించబడతాయి. పై ఇ-టెండరుకు సంబంధించిన పూర్తి సమాచారం ఇ-టెండరు డాక్యుమెంట్లతో పాటు http://www.ireps.gov.in వెబ్‌సైట్ నందు లభిస్తాయి.
సూచన: ఈ టెండరునకు ఏదైనా మార్పు/సవరణ జారీ చేయబడినదేమో తెలుసుకొనుటకు టెండరు ముగింపు తేదీకి 15 (పదిహేను) రోజులు ముందు వెబ్‌సైటు మరొకసారి చూడవలసినదిగా విశ్వసనీయ టెండరుదారులకు సలహా ఇవ్వటమైనది. టెండరుదారులు/బిడ్డర్లు క్లాస్-III డిజిటల్ సిగ్నేచర్ సర్టిఫికెట్ కలిగి ఉండాలి. మరియు IREPS పోర్టల్ నందు తప్పక నమోదు చేసుకుని ఉండాలి. రిజిస్టర్డ్ టెండరుదారు / బిడ్డరు మాత్రమే ఇ-టెండరింగ్ నందు పాల్గొనవలెను.
టెండరుదారులు యొక్క అన్ని సూచనలను టెండరుదారులు జాగ్రత్తగా చదవాలి మరియు అన్ని సూచనలు సమ్మతించవట్లు నిర్ధారించాలి.
డిప్యూటీ చీఫ్ ఇంజనీరు (Con-I), విశాఖపట్నం
PR-193/CH/24-25

# ఫిర్యాదులు పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు

పాడేరు, (విశాఖ సమాచారమ్):- ప్రజల సమస్యలు పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ హెచ్చరించారు. వినతులపై సక్రమంగా ఎండార్స్మెంట్ వేయాలని ఆదేశించారు. శుక్రవారం సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థలో నిర్వహించిన ప్రజా సమస్యలు పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ డా. ఎం.జె. అభిషేక్ గౌడ, సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, డి ఆర్ ఓ కె. పద్మలతతో కలిసి 115 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పి జి ఆర్ ఎస్ పై ప్రత్యేక దృష్టి పెడుతోందన్నారు. పిజి ఆర్ గురుంచి ప్రజల నుండి ప్రతికూల ప్రతి స్పందన వస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని అన్నారు.సచివాలయం పరిధిలో పరిష్కరించాల్సిన సమస్యలు జిల్లా కేంద్రం వరకు రాకూడదన్నారు. సచివాలయం స్థాయిలోనే పరిష్కరించాలన్నారు. జిల్లాలో అభివృద్ధిలో 15 శాతం పురోగతి సాధించాలని చెప్పారు. 15 శాతం వృద్ధి సాధించడానికి ప్రణాళికలు తయారు చేయాలని ఆదేశించారు. ప్రాధమిక రంగాలలో పురోగతి సాధించాలని చెప్పారు. ఖరీఫ్, రబీలో సాగు విస్తీర్ణం పెరగాలన్నారు. వేసవిలో తాగు నీటి సమస్యలు లేకుండా గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.

**కొన్ని ఫిర్యాదులు**

పెదబయలు మండలం పోయిపల్లి పంచాయతీ అర్లాబు గ్రామస్తులు తన భూమిలో ఉన్న నీలగిరి తోటలు సరికి విక్రయించడానికి అనుమతులు మంజూరు చేయాలని జె. మత్స్యరాజు వినతి పత్రం సమర్పించారు. ముంచంగి పుట్టు మండలం జర్రెల పంచాయతీ కర్రిముకిపుట్టు నుండి చెరువు వీధి వరకు రోడ్డు నిర్మించాలని అందజేసారు. వి. భీమలింగం దరఖాస్తును అరకు వ్యాలీ మండలం మాడగడ పంచాయతీ ??. హట్టగుడ గ్రామానికి చెందిన గొల్లోరి కమల ఇల్లు మంజూరు చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. పాడేరు మండలం మినుములూరు సర్పంచ్ ఎల్. చిట్టమ్మ సల్ది గెడ్డ వంతెన, రోడ్డు పనులను పూర్తి చేయాలని వినతిపత్రం సమర్పించారు. పెదబయలు మండలం గోమంగి పంచాయతీ పంగళము, సంపంచగి బంద గ్రామస్తులు జి. మాణిక్యం, పి. గోపాల్, పి. బాలకృష్ణ తదితరులు పంగళం, సంపంగిబంధ గ్రామాలకు రోడ్డు నిర్మించాలని కోరారు.

# బెల్లం మార్కెట్‌కు పూర్వ వైభవం తీసుకొస్తా

- శాసనసభ్యులు కొణతాల
- నియోజకవర్గంలో కలెక్టర్ ,ఎమ్మెల్యే విస్తృత పర్యటన





అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):- పట్టణంలో స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణ న్ విస్తృతంగా పర్యటించారు. పర్యటనలో భాగంగా. స్థానిక ఎన్టీఆర్ మార్కెట్ యార్డు ను కలెక్టర్ విజయ కృష్ణన్ ,శాసన సభ్యులు కొణతాల రామకృష్ణ మార్కెట్ యార్డ్ లో ఉన్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు . ఈ సందర్భంగా రైతులతో వర్తకులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బెల్లం తయారీ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు రామకృష్ణ మాట్లాడుతూ తొందరలో సమస్యలపై చర్చ జరిపి సమస్యలు పరిష్కరిస్తామని యార్డులో రైతు బజార్ ఏర్పాటు చేసి వ్యాపార కేంద్రంగా రూపొందిస్తామని అంతేగాక బెల్లం మార్కెట్ కు పూర్వ వైభవం తీసుకువస్తామని రామకృష్ణ అన్నారు. అనంతరం కొత్తూరు సాయి నగర్లో ఆగస్టు ఇంకా పర్యటించారు. అక్కడ ఉన్న డంపింగ్ యార్డ్ ను జిల్లా కలెక్టర్ విజయకృష్ణ న్ శాసనసభ్యులు కొణతాల పరిశీలించి చుట్టుపక్కల ఉన్న ప్రభుత్వ భూమిపై ఆరా తీశారు. భూమి సర్వే చేయించాలన్నారు.ఎనిమిదిన్నర ఎకరాలలో ఉన్న డంపింగ్ యార్డ్ స్థలం లో చిల్డ్రన్స్ పార్క్ ఏర్పాటు , ప్లే గ్రౌండ్ లేక కలుద్దాం అనుకున్నాప్రభుత్వ స్కూల్ కి ఎకరం స్థలం కేటాయిన్చాలని ,చెరువును పరిశీలించి చెరువు విస్తీరణం ఎంత ఉందో కొలవమన్నారు. ఆక్రమణలను గుర్తించి రిపోర్ట్ తాయారు చేయాల్సింది గా కలెక్టర్ ని కోరారు చెరువు చుట్టూ లైట్స్ ఏర్పాటు చేసి పోలీస్ గస్తీ ఏర్పాటు చెయ్యాలని సూచించారు. అక్కడ నిర్మించిన ఆర్డీఓ ఆఫీస్ ని క్లీన్ చేయించాల్సింది కలెక్టర్ ని కొణతాల కోరారు . అనకాపల్లి మండలం తుమ్మపాల గ్రామం శారదా నది. దగ్గర ఉన్న ఏలేరు కెనాల్ పరిసర ప్రాంతాలను శాసనసభ్యులు కొణతాల, అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ తో కలిసి పరిశీలించారు.

కెనాల్ అవతలివైపు ప్రభుత్వ భూమి ఎంత ఉంది జీరాయితీ భూమి ఎంత ఉందో. సర్వే చెయ్యాలని కోరారు ఈ పర్యటనలో ఆర్డీవో ఆయేషా, జీవీఎంసీ జెడ్ సి, తహసిల్దార్ కుటమీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# తక్షణం చెరుకు రైతులను ఆదుకోకపోతే గత ప్రభుత్వ దుస్థితి ప్రస్తుత ప్రభుత్వానికి పడుతుంది



రావికమతం, (విశాఖ సమాచారమ్):- ప్రస్తుత కూటమి ప్రభుత్వం చెరకు రైతులను తక్షణమే ఆదుకోకపోతే గత వైసిపి ప్రభుత్వా నికి పట్టిన గతే కూటమి ప్రభుత్వానికి కూడా పడుతుందని ఉమ్మడి విశాఖ జిల్లా దివ్యాం గుల సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షులు గెంజి శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చోడవరం షుగర్ ఫ్యాక్టరీ రాష్ట్రంలో ఏ వన్ సుగర్ ఫ్యాక్టరీగా మంచి గుర్తింపు పొందింది అన్నారు. ఈ ఫ్యాక్టరీ గతంలో ఏడాదికి 10 లక్షలు టన్నుల వరకు క్రషింగ్ జరిగేదన్నారు. అది రాను రాను ఎనిమిది లక్షలు, ఐదు లక్షలు, రెండు లక్షలు, క్రషింగ్ ఏడాది, ఏడాదికి దివాలా తీసిన పరిస్థితి అందరికీ తెలిసిందే అన్నారు. రైతు సుభిక్షంగా ఉన్న నాడే గ్రామాలు, రాష్ట్రాలు సస్యశ్యామలంగా ఉంటాయన్నారు. రైతుకు ఐదేళ్ల క్రితం చెరకు వేసిన రైతులం దరికీ 15 రోజులకు ఒక మారు చెరకు కాటాల వద్దకే సొమ్మును తీసుకువచ్చి రైతు లకు పంపిణీ చేసేవారు అన్నారు. అంతేకాకుండా రైతులకు ఏడాదికి అవసర మయ్యే చెరకు దవ్వ, ఎరువులు, మందులు, పిండి, రైతుకు అడ్వాన్సుగా రైతు పెట్టుబడి అందించేవారు అన్నారు.అది రాను రాను మొత్తం రాయితీలు అన్ని పూర్తిగా తీసివేసి ఇప్పుడు కనీసం ఇవేమీ ఇవ్వకపోగా తోలిన చెరకకు సైతం ఏళ్ల తరబడి సొమ్ము చెల్లిం చకపోవడంతో రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ విషయమై జిల్లా కలెక్టరు, కూటమి ప్రభుత్వంలో ఉన్న జిల్లా మంత్రులు, జిల్లాలో ఉన్న చోడవరం, మాడుగుల, శాసన సభ్యుల తో పాటు మిగిలిన ప్రజాప్రతినిధులందరూ చెరుకు ఫ్యాక్టరీలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరి పైన ఉందని, తక్షణమే వాటిని ఆదు కోవాలని, లేనిపక్షంలో ఉగాది తరువాత రావికమతం మండలంలో రైతులందరితో భారీ నిరసన కార్యక్రమం చేపట్టక తప్పదని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

# ఏసీబీకి చిక్కిన ఆర్ఐ ఎం.కన్నబాబు



నక్కపల్లి, (విశాఖ సమాచారమ్):- రైతు వద్ద 12 వేల రూపాయలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన వదంతం నక్కపల్లి మండల తాసిల్దార్ కార్యాలయంలో జరిగింది దీనికి సంబంధించిన వివరాలు ఇలా.. రైతు తన వ్యవసాయ భూమిలో బోరు వేయించుకోవడానికి అనుమతి కోసం ఆర్ఐ కన్నబాబు 15 వేలు డిమాండ్ చేయడంతో 12 వేలుకు కు ఒప్పందం కుదిరింది. దీంతో రైతు ఏసీబీ అధికారులను ఆశ్రయించిగా శుక్రవారం

నక్కపల్లి తహశీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ ఎం కన్నబాబును లంచం సొమ్మును ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు.అనంతరం నగదు స్వాధీనం చేసుకుని ఏసీబీ అధికారులు తనిఖీలు చేపడుతున్నారు.

# ఘనంగా సమత కళాశాలలో దిశ ఎం.సి.ఎస్ మీట్




విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):- సమత కళాశాలలో దిశ ఎం.సి.ఎస్. మీట్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసినటువంటి విశాఖ కంటైనర్ టెర్మినల్ ప్రైవేట్ లిమిటెడ్ హెచ్. ఆర్ జిత జ్యోతి ప్రజలను చేసి వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలని అందుకు అనుగుణంగా విద్యార్థులు ప్రణాళికలను రూపొందించాలని తెలియజేశారు. అనంతరం దేశ సంపదను ప్రభుత్వ ప్రైవేటు సంస్థల అభివృద్ధికి ఆలోచనలు చేయాలని విశిష్ట అతిథిగా విచ్చేసినటువంటి అల్వార్ దాస్ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్ చైర్మన్ డాక్టర్ ఎస్.పి. రవీంద్ర గారు విద్యార్థులకు పిలుపునిచ్చారు. అనంతరం గౌరవ అతిథి గా విచ్చేసినటువంటి కళాశాల డీన్ & కరస్పాండెంట్ ప్రొఫెసర్ ఎస్. విజయరవీంద్ర మాట్లాడుతూ విద్యార్థులు పరిశోధనాత్మక విజ్ఞానాన్ని వ్యాపార ఆలోచనలను పెంపొందించుకోవాలన్నారు. మేనేజ్మెంట్, కామర్స్ మరియు సైన్స్ విద్యార్థుల కొరకు మార్కెట్ , ఫైనాన్స్, హె%ం%చ్.ఆర్, కామర్స్, %శ్రూ% ఆక్షన్, మ్యాథమెటిక్స్, సైన్స్ , ఫిజిక్స్, బోటనీ అండ్ న్యూట్రిషన్, కంప్యూటర్ సైన్స్ , కెమిస్ట్రీ ఈవెంట్స్ తో పాటు ట్రెజర్ హంట్, గ్రూప్ డాన్స్ కార్యక్రమాలు నిర్వహించారు. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి జిల్లాల నుంచి సుమారుగా 75 కళాశాల నుంచి వివిధ విభాగాల్లో విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ %డ% డైరెక్టర్ ప్రొఫెసర్ జి .శ్రీనివాసరావు గారు దిశ ఎం.సి.ఎస్ మీట్ కన్వీనర్ గంటా రమేష్ గారు, కో- కన్వీనర్లు డాక్టర్. బి. రాజేష్ కుమార్ గారు, అనిత గారు, రీసెర్చ్ డైరెక్టర్ మాధవి లత గారు, వివిధ విభాగ అధిపతులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్య, ఉద్యోగ సమాచారం

## సీ-డాట్‌లో టెక్నీషియన్ పోస్టులు




సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ టెలీమాటిక్స్ ఖాళీగా ఉన్న టెక్నీషియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఏప్రిల్ 25వ తేదీ వరకు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

**పోస్టు పేరు-ఖాళీలు**

**టెక్నీషియన్: 29**

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో సీజీపీఏ/ఓజీపీఏ డిగ్రీలో ఉత్తీర్ణత ఉండాలి.

**వయోపరిమితి:** 25-04-2025 నాటికి 25 ఏళ్లు నిండి ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

**జీతం:** నెలకు రూ.25,500 - రూ.81,100.

**దరఖాస్తు ప్రక్రియ:** ఆన్‌లైన్ ద్వారా.

**ఎంపిక విధానం:** రాత పరీక్ష, స్కిల్ టెస్ట్ ఆధారంగా.

**దరఖాస్తుకు చివరి తేదీ:** 25-04-2025.

## ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెంటర్స్ అథారిటీలో ఖాళీలు




ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెంటర్స్ అథారిటీ.. వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులను కోరుతోంది. ఏప్రిల్ 8వ తేదీ వరకు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చు.

**పోస్టు పేరు-ఖాళీలు**

1. యంగ్ ప్రొఫెషనల్: 01
2. సిస్టం అడ్మినిస్ట్రేట్(ఎస్ఏ):01
3. టెక్నికల్ సపోర్ట్ ఇంజనీర్(టీఎస్ఈ): 01
4. సైబర్ సెక్యూరిటీ ఇంజనీర్(కన్సల్టెన్సీ గ్రేడ్-1): 01

**మొత్తం ఖాళీల సంఖ్య: 04**

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంసీఏ, బీఈ, బీటెక్, మాస్టర్స్ డిగ్రీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

**వయోపరిమితి:** యంగ్ ప్రొఫెషనల్ పోస్టుకు 32 ఏళ్లు, కన్సల్టెంట్ గ్రేడ్-1కు 45 ఏళ్లు.

**జీతం:** నెలకు యంగ్ ప్రొఫెషనల్‌కు రూ.70,000, కన్సల్టెంట్ గ్రేడ్-1కు రూ.80,000 - రూ.1,45,000.

**దరఖాస్తు ప్రక్రియ:** ఆఫ్‌లైన్ ద్వారా.

**చిరునామా:** ది జనరల్ మేనేజర్(అడ్మిన్), ఐఎఫ్ఎస్సీఏ, సెకండ్ ఫ్లోర్, ప్రగ్యా టవర్, బ్లాక్ 15, జోన్-1, రోడ్ 1సీ, జీఐఎఫ్‌టీ సెజ్, గిఫ్ట్ సిటీ, గాంధీ నగర్ గుజరాత్-382355,

**ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.

**దరఖాస్తు చివరి తేదీ:** 08-04-2025.

## ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్‌లో 182 ఇంజనీర్ పోస్టులు




ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ ఢిల్లీ ఖాళీగా ఉన్న ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మే 1వ తేదీ వరకు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

**పోస్టు పేరు - ఖాళీలు**

1. ఇంజనీర్(ఆర్ఈ-సివిల్): 40
2. ఇంజనీర్(ఆర్ఈ- ఎలక్ట్రికల్): 80
3. ఇంజనీర్(ఆర్ఈ- మెకానికల్): 15
4. ఎగ్జిక్యూటివ్(ఆర్ఈ- హ్యూమన్ రీసోర్స్): 07
5. ఎగ్జిక్యూటివ్(ఆర్ఈ-ఫైనాన్స్): 26
6. ఇంజనీర్(ఆర్ఈ-ఐటీ): 04
7. ఇంజనీర్(ఆర్ఈ-కాంట్రాక్ట్ మెటీరియల్): 10

**మొత్తం ఖాళీల సంఖ్య: 182**

**అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్(సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్, ఐటీ), ఎంఈ, డిగ్రీ, సీఏ, సీఎంఏ, పీజీడీఎం, ఎంబీఏ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

**వయోపరిమితి:** 30 ఏళ్లు.

**జీతం:** సంత్సరానికి రూ. 11,00,000.

**దరఖాస్తు ప్రక్రియ:** ఆన్‌లైన్ ద్వారా.

**దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.500, ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.

**ఎంపిక విధానం:** కంప్యూటర్ ఆధారిత రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.

**దరఖాస్తు చివరి తేదీ:** 01-05-2025.

# నేడు తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం



కొయ్యూరు, (విశాఖ సమాచారమ్):- ఈనెల 29న తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కొయ్యూరు మండల ప్రధాన కార్యదర్శి క్లస్టర్ ఇంచార్జి తోట దొరబాబు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు 29వ తేదీ శనివారం నాడు తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి పంచాయతీలో పార్టీ దిమ్మలు కట్టి ఘనంగా పండగ వాతావరణంలా జెండా ఎగురవేయాలని ఆయన తెలుగుదేశం శ్రేణులకు కోరారు.

# నేడు తెలుగుదేశం పార్టీ 43 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

### పార్టీ కార్యాలయం వద్దకు నాయకులు తరలి రావాలి మండల పార్టీ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్



నక్కపల్లి, (విశాఖ సమాచారమ్):- శనివారం 9.00 గంటలకు తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నక్కపల్లి మండలం తెలుగుదేశం పార్టీ కార్యాలయం దగ్గర జెండా ఎగురవేసి ఈ వేడుకలను ఘనంగా నిర్వహించాలని, కనుక నాయకులు కార్యకర్తలు అభిమానులు మరియు తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా మండల నాయకులు కొప్పిశెట్టి వెంకటేష్ తెలిపారు.

# ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా ప్రింట్ & ఎలక్ట్రానిక్ మీడియా ఎన్నిక

### పాత్రికేయుల సమస్యలపై నిరంతర పోరాటం ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు



కొయ్యూరు, (విశాఖ సమాచారమ్):- జర్నలిస్టుల సమస్యల పరిష్కరించడంలో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) నాయకులు ముందుంటారని, హౌసింగ్ , అక్రిటేషన్ మంజూరికై ఎల్లవేళలా ప్రభుత్వంతో చర్చిస్తున్నామనీ ఏ పిడబ్ల్యూజే ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు హామీ ఇచ్చారు. అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు కాఫీ హౌస్ వద్ద రాష్ట్ర అధ్యక్షుడు ఆంజనేయులు అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. ప్రింట్ మీడియా నుండి జిల్లా ప్రధాన కార్యదర్శిగా పి.డి .చక్రవర్తినీ, ఉపాధ్యక్షుడిగా కొయ్యూరు పాత్రికేయుడు (నేషనల్ న్యూస్ ఎక్స్ప్రెస్) ధన్యం రాజు సత్యనారాయణను, ప్రధాన కార్యదర్శిగా షేక్ రెహమాన్ తుల్లా (అరకు) , సహాయ కార్యదర్శి డి.రామ చంద్రరావు (పాడేరు), కోశాధికారిగా టి. సుఖిల్ కుమార్(పాడేరు), సభ్యులు పి. దేముడు బాబు (పాడేరు), వి .శ్రీను (జి. మాడుగుల) ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అలాగే ఎలక్ట్రానిక్ మీడియా నుండి జిల్లా అధ్యక్షుడిగా రాజవొమ్మంగి పాత్రికేయుడు ఈక శ్రీను బాబు (ఇమేజ్) ను, సహాయ కార్యదర్శిగా వీర్రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నుకోబడిన నాయకులను నాయకులు ఇతర తోటి జర్నలిస్టులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్లూరు జిల్లా నుండి పాడేరు, అరకు, కొయ్యూరు, రాజవొమ్మంగి, చింతపల్లి మండలాల ఏపీడబ్ల్యూజే ఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

# నర్సీపట్నం మెప్మా సిబ్బందికి వరల్డ్ రికార్డులు

### సభాపతి చేతుల మీదుగా ప్రదానం



నర్సీపట్నం, (విశాఖ సమాచారమ్):- నర్సీపట్నం పురపాలక పరిధిలో మెప్మా సిబ్బందికి ఎస్ హెచ్ జి సభ్యులు తయారు చేసే ఉత్పత్తులు ఓఎన్డిసి ఆన్లైన్ ప్లాట్‌ఫామ్ ద్వారా మార్చి 8వ తేదీన కొనుగోలు లక్ష దాటిన సందర్భంగా వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్ సర్టిఫికెట్లు 3 అందాయి. నర్సీపట్నం స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు మెప్మా సిబ్బందికి ఆ రికార్డులను అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ప్రతీ ఇంటికి ఒక మహిళా వ్యాపారవేత్తగా తయారు చేయాలనే ప్రభుత్వం ఆశయాన్ని ప్రతి సభ్యురాలు వినియోగించుకోవాలని సూచించారు. మెప్మా సిబ్బంది ప్రతి వార్డులో సభ్యులకు అవగాహన కల్పించి, ఆన్లైన్ బిజినెస్ ద్వారా ఉత్పత్తులను మార్కెట్ చేసి, ఉపాధి అవకాశాలను పెంపొందించి అధిక ఆదాయం పొందేలా మహిళలు ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సి ఓ లుగా బి. రమాదేవి, భాస్కర్, భాను, నూకరత్నం, శ్రీదేవి, సి ఎల్ ఆర్ పి లుగా వరలక్ష్మి, సునీత, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# చట్టాలు కఠినం.... పర్యవసానాలు తీవ్రం

### పోక్సో చట్టంపై అవగాహన పెంచుకోండి





విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):- చట్టాలు చాలా కఠినంగా ఉంటాయని తప్పు చేస్తే వాటి పర్యవసానాలు జీవితంపై తీవ్రమైన ప్రభావాన్ని చూపుతాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల వైవిఎస్ మూర్తి ఆడిటోరియంలో లీగల్ సర్వీసెస్ అథారిటీ, ఏయు సంయుక్తంగా నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సును ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ మాట్లాడుతూ చిన్నారులను లైంగిక వేధింపులు, దాడుల నుంచి రక్షించడానికి ఫోక్సో చట్టాన్ని తీసుకురావడం జరిగిందని చెప్పారు. ఈ చట్ట పరిధిని తెలుసుకునే ప్రయత్నం ప్రతి వ్యక్తి చేయాలని సూచించారు. నేరానికి పాల్పడిన వారు మైనర్ అయినా సరే శిక్ష తప్పదని చెప్పారు. పోక్సో కేసులో జీవిత ఖైదు, 20 సంవత్సరాల వరకు శిక్షలు పడే అవకాశం ఉందని చట్ట పరిధిని వివరించారు. హైకోర్టు సూచించిన విధంగా విస్తృతంగా అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పలు కేసుల పరిష్కారంలో ఆధునిక సాంకేతికతలు ఉపయుక్తంగా నిలుస్తున్న విధానాన్ని తెలియజేశారు.

ముఖ్యంగా విద్యావంతులైన యువత ఈ చట్టం గురించి తెలుసుకొని ఇతరులలో అవగాహన కల్పించాలని సూచించారు. విద్యార్థులు సమాజానికి ఒక మార్గ నిర్దేశకులుగా నిలవాలని, చట్టాల పట్ల వారిలో అవగాహన పెంచాలని సూచించారు. ఎవరైనా తెలిసో తెలియకో బాల బాలికలపై లైంగిక చర్యలకు దాడికి పాల్పడితే చట్టం నుంచి తప్పించుకోలేరని, వారిజీవితం అంధకారం అవుతుంది అనే విషయాన్ని గుర్తుంచుకోవాలని చెప్పారు. మైనర్ పట్ల అంగీకారంతో అనుచితంగా ప్రవర్తించినా అది నేరం కిందే వస్తుందని చెప్పారు. సినిమాలు, సోషల్ మీడియా ప్రభావం యువతపై ఎక్కువగా పడుతుందని వీటి నుంచి కొంచెం దూరంగా ఉండటం మంచిదన్నారు. వీటి ప్రభావానికి యువత గురికాకుండా దృఢమైన మనసుతో ముందుకు సాగాలని సూచించారు. ముందుగా ప్రజల మైండ్ సెట్ లో మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. మన వ్యక్తిత్వాన్ని ఉన్నతంగా నిలుపుకుంటూ, జీవితాన్ని అర్ధం చేసుకునే ప్రయత్నం చేయాలని సూచించారు. వివిధ సందర్భాల్లో న్యాయస్థానంలో తనకు ఎదురైన సంఘటనలను విద్యార్థులకు వివరిస్తూ చట్టపరిధి, శిక్షలు వాటి పర్యవసానాలను ఆసక్తిదాయకంగా విద్యార్థులకు అర్థమయ్యే విధంగా వివరించారు. అనంతరం విద్యార్థులు అడిగిన పలు సందేహాలకు సమాధానాలు ఇచ్చి వారి సందేహాలను నివృత్తి చేశారు.

ఏయూ ఉపకులపతి ఆచార్య జి.పి రాజశేఖర్ మాట్లాడుతూ విభిన్న సామాజిక అంశాలపై విద్యార్థులను చైతన్యం చేసే విధంగా ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తామని చెప్పారు. ఉమ్మడి కుటుంబాలు తగ్గిపోయి చిన్న కుటుంబాల ఏర్పడడంతో కొన్ని సమస్యలు ఉత్పన్నం అవుతాయని అన్నారు. ప్రతి వ్యక్తి నిత్యం తనతో తాను ఒకసారి మాట్లాడుకునే ప్రయత్నం చేయాలని సూచించారు. మానసికంగా దృఢంగా ఉండడం, మన సమస్యలను కుటుంబ సభ్యులతో పంచుకోవడం యువత అలవాటు చేసుకోవాలని సూచించారు. సమాజ ప్రగతికి దోహదపడే విధంగా యువత నడుచుకోవాలని అన్నారు. యువత నేరపూరిత చర్యలలో భాగమై తమ జీవితాన్ని నాశనం చేసుకోవద్దని హితవు పలికారు.

ఏయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశి భూషణ రావులి మాట్లాడుతూ యువత చట్టాల పట్ల అవగాహన పెంచుకొని, ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీగల్ సర్వీసెస్ అధారిటీ కార్యదర్శి న్యాయమూర్తి ఎం.వెంకట శేషమ్మ, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ మల్లేశ్వరి పోక్సో చట్టాన్ని విపులంగా వివరించారు. ఎడిసిపి మోహనరావు, మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.జయ దేవి, ఆచార్య పాల్ డగ్లస్ వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగులకు 7500 కోట్లు విడుదలపై కూటమిపై నమ్మకం కలిగింది

### కొణతాల వెంకటరావు



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):- కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ 9 మాసాలలో 7500 కోట్లను ఉద్యోగస్తుల ఖాతాలకు జమ చేయడం ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పై ఉద్యోగస్తులకు నమ్మకం కలిగిందని తెలుగుదేశం పార్టీ అనకాపల్లి పార్లమెంట్ మీడియా కోఆర్డినేటర్ కొణతాల వెంకటరావు హర్షం ప్రకటించారు. గత ఐదు సంవత్సరాలు జగన్ మోహన్రెడ్డి పాలనలో ఉద్యోగస్తులు దాచుకున్న సొమ్మును 20 వేల కోట్ల రూపాయలు దారి మళ్లించి వారి నోట్లో మట్టి కొట్టారని వారు దాచుకున్న డబ్బును వాళ్ళ అవసరాలకు తీసుకొనే అవకాశం లేకుండా నియంత పాలన చేసి వారి ఉసురు పోసుకున్నారని వెంకటరావు అన్నారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం, ఉద్యోగుల మ్యాచింగ్ 2300 కోట్లు బకాయిలను ప్రభుత్వం చంద్రబాబు నాయుడు విడుదల చేయడం ఉద్యోగుల్లో మానసిక ధైర్యాన్ని కలుగజేసిందని వెంకటరావు అన్నారు. శ్రీ భోగలింగేశ్వర దేవస్థానం చైర్మన్ కాంద్రేగుల సత్యనారాయణ మాట్లాడుతూ దార్శనికుడైన చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారాధ్యంలో ఉద్యోగుల పక్షపాతని, సిపీఎస్ ఉద్యోగులు రాష్ట్ర ఎంప్లాయిస్ యూనియన్ అన్ని వర్గాలు కూడా చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చర్యలను కొనియాడారని, భవిష్యత్తులో డిఏలు, పెండింగ్ డిఎ బకాయిలు పిఆర్సి నియామకంతో పాటు ఐఆర్ కూడా ప్రకటించి ఉద్యోగుల పక్షాన నిలవాలని రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి బుద్ధ కాశీ విశ్వేశ్వరరావు తో పాటు సత్యనారాయణ వెంకటరావు ఎంతో ఆశతో ఉన్నారని అన్నారు. ఆరుగాలం కష్టపడిన పోలీసు ఉద్యోగస్తులకు వారు దాచుకున్న పిఎఫ్, సరెండర్ లీవ్ బకాయిలు, పెళ్లిళ్లకు, గృహ నిర్మాణాలకు, ఆరోగ్య అవసరాలకు, పిల్లలు చదువులకు స్వయాన అర్జీలు పెట్టుకున్న, వారు దాచుకున్న సొమ్ము వారికి ఇవ్వడానికి జగన్ రెడ్డి పాలనలో నానాయాతన పడి అప్పుల పాలయ్యారని వారందరికీ కూటమి ప్రభుత్వంలో ఆనందంగా ఆహ్లాదంగా నిధులు విడుదలతో ఉద్యోగస్తులు మురిసిపోతున్నారని వెంకటరావు సత్యనారాయణ కాశీ విశ్వేశ్వరరావు అన్నారు.

# తెలుగుదేశం ఆవిర్భావ దినోత్సవం జయప్రదం చేయండి

### జిల్లా అధ్యక్షులు బత్తుల



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):- అనకాపల్లి శ్రీ నూకాంబిక అమ్మవారు కొత్త అమావాస్య జాతర మహోత్సవాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర పండగ ప్రకటించిన నేపథ్యంలో 29వ తేదీన ఉదయం 9 గంటలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున శ్రీ నూకాంబిక అమ్మవారికి పట్టు వస్త్రాలు రాష్ట్ర హెూం శాఖ మంత్రి వంగలపూడి అనిత సమర్పిస్తున్నారని, మరియు గనుల శాఖ అనకాపల్లి జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు కొల్లు రవీంద్ర పాల్గొంటారని తెలుగుదేశం పార్టీ అనకాపల్లి పార్లమెంటు జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబు ప్రధాన కార్యదర్శి లాలం కాశీ నాయుడు శుక్రవారం విలేకరుల సమావేశంలో తెలియజేశారు. తెలుగు దేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం మార్చి 29వ తేదీన అనకాపల్లి పార్లమెంట్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు జరుగు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అనకాపల్లి జిల్లా ఇన్చార్జి మంత్రి కొల్లు రవీంద్ర రాష్ట్ర హెూంశాఖ మంత్రి వంగలపూడి అనిత పాల్గొంటున్నారని, ఈ కార్యక్రమానికి శాసనసభ్యులు, పార్లమెంట్ సభ్యులు నియోజకవర్గ ఇన్చార్జులు తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ కమిటీ సభ్యులు నియోజవర్గ కమిటీలు మండల కమిటీలు టౌన్ కమిటీ సభ్యులు కార్పొరేటర్లు మున్సిపల్ కౌన్సిలర్ కార్పొరేషన్ డైరెక్టర్లు కస్టర్ కమిటీలు బూత్ కమిటీ సభ్యులు తెలుగుదేశం పార్టీ అనుబంధ సంస్థలు తెలుగు మహిళ తెలుగు రైతు టి ఎన్ టి యు సి టిఎన్ఎస్ఎఫ్ బీసీ సెల్ ఎస్సీ సెల్ ఎస్టీ సెల్ మైనార్టీ సెల్ సభ్యులు విధిగా పాల్గొని ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరుపుకొనుటకు తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు అందరూ విధిగా పాల్గొని తాతయ్య బాబు కాశీ నాయుడు శ్రేణులకు పిలుపునిచ్చారు.

# అమెరికా ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):- అమెరికా మాజీ ప్రధాని జో బైడన్ సొంత రాష్ట్రం డెలవేర్‌లో జరిగిన స్థానిక జనసేన పార్టీ జన సైనికులు వీర మహిళలు ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో విశాఖ నగర జనసేన పార్టీ అధ్యక్షులు, దక్షిణ నియోజకవర్గ గౌరవ శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక పార్టీ నేతల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ప్రసంగిస్తూ జనసేన పార్టీ దేశంలో అత్యంత ప్రజాదరణ కలిగిన పార్టీగా 100% స్ట్రైక్ రేట్ తో ఘన విజయం సాధించామని అన్నారు. వివిధ రంగాల్లో వున్న మేధావులు, ప్రముఖులు, ఎన్నారై లు పార్టీ కోసం ఆది నుంచి కృషి చేస్తున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ప్రతి ఒక్కరు కూడా ఎన్డీఏ కూటమి మరింత బలోపేతానికి సహకారం అందించాలని ఈ సందర్భంగా కోరారు. మెగా కుంటుంబం పై వున్న అభిమానం తో రాజకీయాలలో వచ్చానని, గౌరవ డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ఎమ్మెల్యేగా అవకాశం కల్పించారని సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే వంశీని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లక్ష్మీకాంత్, విష్ణు వర్ధన్, జన సైనికులు వీర మహిళలతో పాటు జనసేన నాయకులు బొకం శ్రీనివాస్ పాల్గొన్నారు.

# నేడు సాయంత్రం నాలుగున్నర గంటల నుండి నూకాంబిక అమ్మవారి దర్శనం నిలుపుదల



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):- ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు అనకాపల్లి గవరపాలెం లో వెలిసిన శ్రీ నూ కాంబికా అమ్మవారి దేవ స్థానంలో శనివారం కొత్త అమా వాస్య సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిమిత్తం సాయంత్రం 4. 30 నిమిషాల నుండి అమ్మ వారి దర్శనాలు నిలిపివేయడం జరుగుతుందని, మరల ఆదివారం ఉదయం 5 గంటలు నుండి అమ్మవారి దర్శనం ఉంటాయి అని, కావున భక్తులందరూ సహకరించవలసినదిగా కోరుచున్నాము. ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగ శ్రీను (గొల బాబు), ఆలయ సహాయ కమిషనర్ వెంపలి రాంబాబు, ధర్మకర్తలు, తెలియజేశారు.

# అభివృద్ధి పనులకు శంకుస్థాపన



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):- పెందుర్తి నియోజక వర్గం జీవీఎంసీ 94 వ వార్డులో శుక్రవారం స్థానిక కార్పొరేటర్ బల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బంటా కాలనీ చైతన్య కాలనీ, వేపగుంట శివాలయం దగ్గర, వేపగుంట ఎంపీపీ స్కూలు పక్కన, కృష్ణరాయపురం, పురుషోత్తపురం గ్రామాలలో 2 కోట్ల 19 లక్షల రూపాయలతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన నిర్వహించినలి జనసేన పార్టీ ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షులు పెందుర్తి నియోజకవర్గం శాసనసభ సభ్యులు పంచకర్ల రమేష్ బాబు వీరితోపాటు జోన్ 8 జోనల్ కమిషనర్ హైమావతి, డి.ఈ ప్రవీణ్, వార్డు అధ్యక్షులు పెన్నింటి పార్వతి, స్థానిక నాయకులు గంట్ల దేవుడి, సానాతి దేవుడి, సాలాపు రమణ, శెసెట్టి అప్పారావు, పిల్లా జగన్మోహన్ పాత్రుడు, గని శెట్టి సూరిబాబు, తనకాల శ్రీను, మోటూరు చైతన్య, త్రిబుల్ ఎస్.రమేష్, గండి వేణు, మామిడి కిరణ్, బొబ్బర నరసింహం, చల్లారావు, నారు వేణు, బొబ్బర్ ప్రసాద్, శేషు, ఈశ్వరరావు, చీర అప్పలరాజు, ఎలమంచిలి శ్రీను, పిల్లల శ్రీను, పిల్లలా రాజు, టెన్ అప్పలరాజు, ఎలమంచిలి కనకరాజు, నంబర్తి కృష్ణ, నంబర్తి ముత్యాల, మజ్జి సూరిబాబు, రాపర్తి కృష్ణమోహన్, కోరుకొండ వరహా, బంటు సురేష్, రాపర్తి కిషోర్, సోమశేఖర్, ముక్కా సంతోష్, ముమ్మనా గురువు, గొర్ల అప్పారావు, హైమావతి, వరూధిని, అంబటి వెంకట్రావు మొదలగు ఉమ్మడి ఎన్డిఏ మహా కూటమి 94 అవార్డు నాయకులు కార్యకర్తలు, వీర మహిళలు ఈ యొక్క శంకుస్థాపన కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# నిత్యావసర వస్తు ధరల నియంత్రణపై దృష్టి సారించాలి

### ధరల నియంత్రణ కమిటీ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):- మార్కెట్లో నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, వినియోగదారుల అవసరాల మేరకు నిల్వలను అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్ ఆదేశించారు. కలెక్టరేట్ వీసీ హాలులో జిల్లా ధరల నియంత్రణ కమిటీ సభ్యులతో సమావేశమైన ఆయన వివిధ అంశాలపై సమీక్షించారు. ప్రస్తుతం పప్పులు, బియ్యం ధరలు అధికంగా ఉన్నాయని వాటిని నియంత్రించే దిశగా చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. మార్కెట్ స్థితిగతులను అంచనా వేస్తూ తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. రైతు బజార్లు, బయట మార్కెట్లలో ధరలను పరిశీలించాలని, కమిటీ సభ్యులు, అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా చూడాలని చెప్పారు. రైతు బజార్లలో ప్రస్తుతం ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బియ్యం, పప్పు దినుసుల కేంద్రాల సేవలపై ఆరా తీసిన ఆయన బయట మార్కెట్లో కూడా ధరలు తగ్గించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎస్టేట్ అధికారులు బాధ్యతగా పని చేయాలని జేసీ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి కల్యాణ్, మార్కెటింగ్ ఏడీ యాసిన్, హార్టికల్చర్, రైతు బజార్ల ఎస్టేట్ అధికారులు, ధరల నియంత్రణ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ క్రైస్తవ మత బోధకుడు ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతిపై విచారణ జరిపించాలి




పాయకరావుపేట, (విశాఖ సమాచారమ్):- అంతర్జాతీయ క్రైస్తవ మత బోధకుడు ప్రవీణ్ పగడాల రాజమండ్రి వద్ద అనుమానాస్పద మృతిపై వెంటనే న్యాయ విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని " పాయకరావుపేట మండల రూరల్ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ " ఆధ్వర్యంలో మండలంలోని నామవరం జాతీయ రహదారిపై పాస్టర్లు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సంధర్భంగా అసోసియేషన్ నాయకులు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ... ఈ మధ్య కాలంలో క్రైస్తవులపై దాడులు పెరిగిపోతున్నాయని ప్రభుత్వం క్రైస్తవులకు రక్షణ కల్పించాలని కోరారు. ప్రవీణ్ పగడాల మృతిపై విచారణ జరిపించి క్రైస్తవ సమాజానికి న్యాయం చేయాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పాయకరావుపేట మండల రూరల్ పాస్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కెఎస్ఆర్ థామస్, రెవ ఏసురత్నం, రెవ ఎస్ ఒబద్యా, రెవ ఎస్ జార్జి, వైస్ ప్రెసిడెంట్ శామ్యూల్, జోషి , జాషువా, సత్య కుమార్, ప్రభురాజు, మోజెస్, రత్నం, డేనియల్ తదితరులు పాల్గొన్నారు.

### నర్సీపట్నం మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా
# రుత్తుల శేషు కుమార్



నర్సీపట్నం, (విశాఖ సమాచారమ్):- నర్సీపట్నం మార్కెట్ యార్డు చైర్మన్ గా మాకవరపాలెం మండలం టిడిపి సీనియర్ నాయకులు, మాజీ జెడ్పిటిసి రుత్తల శేషు కుమార్ నియమితులైనట్టు ఆ పార్టీ వర్గాల వారు తెలిపారు.

# ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):- అంతర్జాతీయ రంగస్థల దినోత్సవంను పురస్కరించుకుని ఆంధ్రా యూనివర్సిటీ గోపాలస్వామి ఆరుబయలు కళాక్షేత్రంలో ఏయూ థియేటర్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. తులసీ తీర్థం , హాస్య గుళికలు నాటికలు రంజింపచేసాయి. ఫిలాసఫీ విభాగానికి చెందిన అధ్యాపకులు డా.ముసుగు ప్రసాద్ సత్య హరిశ్చంద్ర నాటకం నుండి గుర్రం జాషువా రాసిన కాటిసీను పద్యాలు సభికులను విశేషంగా అలరించాయి. ఈ కార్యక్రమంలో ఏయూ ఉపకులపతి ప్రొ. జీవీ రాజశేఖర్, రిజిస్ట్రార్ ప్రొ.ధనుంజయరావు, ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏ.నరసింహారావు, ప్రొ.పేటేటి ప్రేమానందం , అధ్యాపకులు డా.మరపట్ల భాస్కరరావు, స్వామి, త్రినాథ్ రావు తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి "పోలీస్ గ్రీవెన్స్"

### జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆధ్వర్యంలో నిర్వహణ



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో):- అనకాపల్లి జిల్లా పోలీసు శాఖలో పనిచేస్తున్న వివిధ స్థాయిల సిబ్బందికి ఎదురయ్యే సమస్యలను స్వయంగా పరిష్కరించేందుకు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తన కార్యాలయంలో "పోలీస్ గ్రీవెన్స్" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది మరియు హెూం గార్డులు హాజరై ఆరోగ్య, ఉద్యోగ, వ్యక్తిగత సమస్యలను జిల్లా ఎస్పీ కి వివరించారు. వీటి పరిష్కారానికి ఆయన సానుకూలంగా స్పందించి, ఆయా విజ్ఞప్తులను పరిశీలించి, తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. పోలీసు సిబ్బంది సంక్షేమం తమ ప్రథమ లక్ష్యమని ఎస్పీ గారు స్పష్టం చేశారు. ఉద్యోగాల్లో కలిగే ఒత్తిడిని తగ్గించేందుకు, వారి సంక్షేమాన్ని పెంపొందించేందుకు జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు.

# అంబేద్కర్ సేవారత్న అవార్డుకు కాటపల్లి ఎంపిక

### ఈనెల 30న ఒంగోలులో అవార్డు ప్రధానం



దేవరాపల్లి, (విశాఖ సమాచారమ్):- మండల కేంద్రం దేవరాపల్లికి చెందిన దళిత నాయకుడు కాటపల్లి అప్పారావు రాష్ట్రస్థాయి అంబేద్కర్ సేవారత్న అవార్డుకు ఎంపికయ్యారు. గత 30 ఏళ్లుగా అంబేద్కర్ ఆశయ సాధనే ధ్యేయంగా పనిచేసి, సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా పోరాడి, రాజ్యాంగ పరిరక్షణ కోసం పనిచేస్తూ, ఉద్యమ నేతగా, జర్నలిస్టుగా, ప్రజా గాయకుడిగా విశేష సేవలు అందించినందుకు రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా అంబేద్కర్ సేవారత్న అవార్డును ప్రకటించింది. ఈ అవార్డును ఈ నెల 30న ఒంగోలులో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఉగాది పురస్కారాలు మహెూత్సవంలో అందుకోనున్నారు. కాటపల్లికి అవార్డు రావడం పట్ల అంబేద్కర్ సంఘాలు, మండల అంబేద్కర్ ఆశయ సాధన సంఘం సభ్యులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, రాజకీయ ప్రముఖులు, పాత్రికేయులు, పలువురు అభినందనలు తెలిపారు.

## పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు లో 7 స్క్వాడ్ బృందాలు 29 పరీక్షా కేంద్రాలు తనిఖీ

అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో):- అనకాపల్లి జిల్లా నందు పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు తేదీ 28.03.2025న జీవ శాస్త్రం. సబ్జెక్ట్ జరుపబడినదని జిల్లా విద్యాశాఖాధికారి వారు జి.అప్పారావు నాయుడు తెలిపారు.సదరు పరీక్షకు 107 పరీక్షా కేంద్రాల నందు రెగ్యులర్ గా 20774 మంది కి గాను 20669 మంది హాజరై నారని 105 మంది పరీక్షకు హాజరు కాలేదని తెలిపారు. ప్రయివేటు గా 766 మంది కి గాను 649 మంది హాజరై నారని, 117 మంది పరీక్షకు హాజరు కాలేదన్నారు. మొత్తం 21540 మంది కి గాను 21318 మంది హాజరై నారని, 222 మంది పరీక్షకు హాజరు కాలేదన్నారు. 98.97% విద్యార్థులు హాజరైనారని తెలిపారు. మరియు ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం, అమరావతి వారిచే నిర్వహించబడిన 7 పరీక్ష కేంద్రములలో జరిగిన 10 వ తరగతి పబ్లిక్ పరీక్షకు 524 విద్యార్ధులకు గాను 431 మంది విద్యార్థులు హాజరై నారని 93 మంది పరీక్షకు హాజరు కాలేదని తెలియజేసారు.రాష్ట్ర స్థాయి పరిశీలకులు మరియు ఇంటర్మీడియట్ విద్యాశాఖ అదనపు సంచాలకులు పి శ్రీనివాస్ మరియు జిల్లా విద్యాశాఖాధికారి 4 పరీక్షాకేంద్రాలను, 7 స్క్వాడ్ బృందాలు 29 పరీక్షాకేంద్రాలను తనిఖీ చేయడం జరిగిందని తెలిపారు. పరీక్షలు ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని ప్రశాంత వాతావరణములో జరిగినట్లు జిల్లా విద్యాశాఖాధికారి జి.అప్పారావు నాయుడు తెలియజేసారు.

# పోక్సో చట్టంపై అవగాహన కల్పించిన జిల్లా సెషన్స్ జడ్జి ఆలపాటి



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):- ఎన్‌బిఎం న్యాయ కళాశాలకు విశాఖపట్నం ప్రిన్సిపల్ జిల్లా కోర్టు మరియు జిల్లా సెషన్స్ జడ్జి ఆలపాటి గిరిధర్ సందర్శించారు. అంతేకాకుండా పోక్సో చట్టంపై ఎన్‌బిఎం న్యాయ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే న్యాయ కళాశాల విద్యార్థులతో అతను మాట్లాడుతూ నష్టపరిహారం కోసం బాధితులకు ఏ విధంగా న్యాయ సహాయం చేయాలన్నది ఈ మధ్య జరిగిన కొన్ని విచారణలు ఉదాహరణలుగా చేసుకొని వాటిని ఉద్దేశించి మాట్లాడారు. అదేవిధంగా ఈ ఫోక్సో చట్టంపై , బాధించిన వాళ్లకి శిక్షలు, బాధింపబడ్డ వాళ్లకి నష్టపరిహారం గురించి విపులంగా చర్చించారు. అలాగే అన్ని రకాల న్యాయ సమస్యలపై విశాఖపట్నం బార్ అసోసియేషన్ నిరంతరం పనిచేస్తుందని కూడా చెప్పారు. అలాగే ఈ ఫోక్సో చట్టం అవగాహన సదస్సులో విద్యార్థులకు నేరుగా ప్రశ్నలు సంధించి మరింత అవగాహన ఏర్పడేటట్టు చేశారు. ఇంకా ఆయన మాట్లాడుతూ న్యాయవ్యవస్థ పటిష్ఠంగా ఉండాలంటే న్యాయ కళాశాలలు విద్యార్థి దశ నుండే బాధితులకి న్యాయం ఎలా చేయాలని ఆలోచన కల్పించే విధంగా బోధించాలని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమాన్ని ముందుండి నడిపించడంలో ఎన్ బి ఎం న్యాయ కళాశాల డీన్ డి వి రమణ ,ప్రిన్సిపాల్ గాయిత్రి , వైస్ ప్రిన్సిపల్ సాగర్,ఇతర అధ్యాపకులు మరియు అన్ని తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు.

# వైకాపా మండల అధ్యక్షుడిగా గిరి ప్రసాద్ నియామకం

### వైకాపా రాష్ట జిల్లా నాయకులకు పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజుకు కృతజ్ఞతలు



చింతపల్లి, (విశాఖ సమాచారమ్):- అల్లూరు జిల్లాలోని పలు మండలాలకు మండల అధ్యక్షులు పేర్లు ఖరారు చేస్తూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. ఈ మేరకు గూడెం కొత్త వీధి మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా కంకిపా టి గిరి ప్రసాద్ నియమించారు. కంకిపాటి గిరిప్రసాద్ మండలంలోని పెదవలస పంచాయతీ రంపుల గ్రామానికి చెందినవారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లూరి జిల్లా అధ్యక్షులు పాడేరు శాసనసభ్యులు విశ్వేశ్వర రాజు రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైకాపా అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డికి రుణపడి ఉంటానని ఆయన తెలిపారు నాపై ఉంచిన నమ్మకాన్ని ప్రజలు వైసిపి కార్యకర్తలు అభిమానులు మన్ననలు పొందేలా నడుచుకొని మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు కు కృతజ్ఞతలు తెలిపారు. నాపైన అమ్మకు ఉంచి ఈ బాధ్యత అప్పగించినందుకు అన్ని విధాల పార్టీ బలోపేతానికి ఎల్లవేళలా కృషి చేస్తానని ఆయన తెలిపారు వైసీపీ మండల అధ్యక్షులుగా నియమించినందుకు గాను రాష్ట్ర నాయకులకు పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజుకు జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.. అలాగే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కొయ్యూరు మండల అధ్యక్షుడిగా బిడిజన అప్పారావును నియమిస్తూ ఆ పార్టీ ప్రకటించింది.

# నేడు టిడిపి పార్టీ ఆవిర్భావ దినోత్సవం

### పార్టీ నాయకులంతా కలిసి రావాలి



నాతవరం, (విశాఖ సమాచారమ్):- నాతవరం గ్రామంలో పార్టీ ఆఫీసులో రేపు 29 వ తేదీ జరగబోయే తెలుగుదేశంపార్టీ 43వ పార్టీ ఆవిర్భావ దినోత్సవం కార్యక్రమం ప్రతి గ్రామంలో ఆ గ్రామ ప్రెసిడెంట్ ఆధ్వర్యంలో జెండా ఎగరవేయవలసిందిగా నాతవరం మండలం గ్రామ పార్టీ ప్రెసిడెంట్ నందిపల్లి వెంకటరమణ, తాండవప్రాజెక్ట్ చైర్మన్ కరక సత్యనారాయణ తెలియజేశారు. కుటుంబ సాధికార సారధులు నియామకం గురించి ప్రతి 60 ఓట్లకు ఒక జత ఒక కుటుంబ సాధికార సారధులు ఒక పురుషుడు ఒక మహిళ ఇద్దరినీ నియమించుకోవాలని మహిళలకు అవకాశం ఇవ్వాలని పార్టీకి పనిచేసే వారిని వెతికి వారికి అవకాశం ఇవ్వాలని మండల పార్టీ అధ్యక్షులు నందిపల్లి వెంకటరమణ తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో తాండవ చైర్మన్ కరక సత్యనారాయణ , మాజీ ఎంపీపీలు పారుపల్లి కొండబాబు నేతల విజయకుమార్, సింగపల్లి సన్యాసిదేవుడు మండల మహిళా అధ్యక్షురాలు ఇనపసప్పల సత్యవతి. మాజీ ఎంపీటీసీ అప్పిరెడ్డి మాణిక్యం. తెలుగు యువత అధ్యక్షులు శెట్టి లోవ మండల ఐటీడీపీ ఇంచార్జ్ శెట్టి గోపి గ్రామ పార్టీ ప్రెసిడెంట్ శెట్టి నానాజీ. ఎస్సీ సెల్ స్టేట్ డైరెక్టర్ కొంద్రు మరిడియ్య, తాండవ డీసీ నెంబరు పారుపల్లి దాసు, మాజీ డిసిసిబి డైరెక్టర్ కూంద్రపు అప్పలనాయుడు,మండల తెలుగుదేశం పార్టీ వైస్ ప్రెసిడెంట్ జీవిరెడ్డి రాజుబాబు, మాజీ పిఎసిఎస్ అధ్యక్షుడు శెట్టి సత్యనారాయణ,తెలుగుదేశం కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వెంపలి రాంబాబు



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో):- జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హాని వారి కార్యాలయంలో శ్రీశ్రీశ్రీ నూకాంబిక అమ్మవారి దేవస్థానం ఆలయ ఎగ్జిక్యూటివ్ అధికారి వెంపలి రాంబాబు మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు.

ఈ సందర్భంగా, రాష్ట్ర పండుగగా ప్రకటించబడిన అమ్మవారి కొత్త అమావాస్య జాతర ఈ రోజు నుంచి ప్రారంభమవుతున్న సందర్భంగా, ఆలయానికి ఆహ్వానిస్తూ ఎస్పీ కి ఆలయ పరిపాలన, భక్తుల ఏర్పాట్లు, భద్రతా చర్యలపై వివరణ ఇచ్చారు. అలాగే, జాతర సందర్భంగా భక్తుల సౌకర్యం కోసం తీసుకుంటున్న ప్రత్యేక ఏర్పాట్లు, దేవస్థానం నిర్వహిస్తున్న విశేష కార్యక్రమాలు, భద్రతా ఏర్పాట్లను మెరుగుపరిచే సూచనలు పైన సుదీర్ఘంగా చర్చించారు. జిల్లా పోలీసులు, భక్తుల రద్దీకి అనుగుణంగా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపడతారని ఈ సందర్భంగా ఎస్పీ గారు హామీ ఇచ్చారు.

# "బిక్కవోలు" ఎమ్‌పీపీ పీఠం బిజెపి వశం



అనపర్తి, (విశాఖ సమాచారమ్):- ఆ మండల పరిషత్ పరిధిలో ఒక్క ఎంపిటిసి లేకపోయినా మండల పీఠాన్ని చేక్కించుకుని తన రాజకీయ ఎత్తుగడలతో మండల పరిషత్ అధ్యక్ష స్థానాన్ని బిజెపికి అందించిన అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణా రెడ్డి. ఇదిరా రాజకీయం" అంటే అని ప్రత్యర్థి పార్టీ గుండెల్లో గునపమై గుచ్చుకున్నాడు. రామకృష్ణా రెడ్డి రాజకీయాన్ని అడ్డుకోలేమని తెలిసి కూడా ఏదో ఒక ప్రయత్నం చేసి అధికార పార్టీకి, అధికారులకు అడ్డంగా దొరికిపోయి బొక్క బోర్లు పడి ఎన్నికకు హాజరు కాకుండా పలాయనం చిత్తగించారు. గత 9 నెలల వరకు బిక్కవోలు మండలాన్ని కంటి చూపుతో నడుపుతూ అధికారాన్ని అనుభవించిన అప్పటి మండల పరిషత్ అధ్యక్షురాలు కొవ్వూరి జ్యోతిర్మయి సత్తిబాబులు గడచిన సార్వత్రిక ఎన్నికలలో ఆమె మాట్లాడుతూ ఆయన గెలిస్తే ( నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ) తాను రాజీనామాకు సిద్ధమంటూ ప్రకటనతో బిక్కవోలు మండల పరిషత్ పీఠానికి ఎన్నిక అనివార్యమైంది. ఎంతో ప్రతిష్టాత్మకంగా జరిగిన ఎమ్మెల్యే ఎన్నికలలో రామకృష్ణారెడ్డి 20వేల పైచిలుక మెజారిటీతో నెగ్గి అప్పటివరకు అధికార పార్టీగా నేతలుగా భారీ రాజకీయాలు నెరిపిన వారి గుండెల్లో గుబులు రేపాడు. తమ రాజకీయాలు ఇక సాగవని తలచిన ఆ కుటుంబం భార్య జ్యోతిర్మయి తో రాజీనామా చేయించి మాకెందుకు ఈ రాజకీయాలంటూ దూరంగా తప్పుకున్నారు. అధికార పార్టీ కార్యక్రమాలకు దేనికి హాజరు కాకుండా ఈ తొమ్మిది నెలల నుంచి ఏమి జరుగుతున్న పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది. ఖాళీ అయిన అధ్యక్ష పీఠాన్ని పూరించడం కోసం ప్రభుత్వం ఈనెల 27వ తేదీన ఎన్నికలు నిర్వహించాలంటూ అధికారులకు ఆదేశాలిచ్చింది. దీంతో కూటమి ప్రభుత్వం నేతగా ఉన్న బిజెపి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి వేసి చూసే ధోరణిలో ఉండగా మండలంలోని వైసిపి నేతలు కొద్దిమంది నైరస్యంలో ఉన్న తమ పార్టీ తమను పట్టించుకోవడం లేదంటూ ఎంపీపీ ఎన్నికలలో అధికార పార్టీకి మద్దతు పలుకుతామంటూ ఆయా గ్రామాల ప్రధాన నాయకులతో రామకృష్ణారెడ్డి తో మంతనాలు జరిపి చర్చలు నిర్వహించిన పదిమంది ఎంపీటీసీలు రామకృష్ణారెడ్డి పంచన చేరారు. అవసరమైతే మండల పీఠాన్ని దక్కించుకోవచ్చు అన్న ధీమాతో రామకృష్ణారెడ్డి తనదైన శైలిలో రాజకీయం నెరిపారు.

మండలంలోని 20 ఎంపీటీసీలు వైయస్సార్ పార్టీ సభ్యులుగా ఉన్నారు. ఎమ్మెల్యే ఎన్నికలు అయినప్పటి నుంచి ఒక్కరొక్కరు గా పదిమంది బిజెపి తీర్థం పుచ్చుకోవడంతో రామకృష్ణారెడ్డి వర్గం 10 మందికి చేరింది. ఎంపీపీ ఎన్నిక ముందు వీరందరికీ బిజెపి జిల్లా అధ్యక్షులు పిక్కి నాగేంద్ర ను తీసుకొచ్చి వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానం పలికారు. తరువాత మండల పరిషత్ సభ్యులను తోడు కొని వెళ్లారు. ఎన్నికల అధికారి అచ్యుత రామారెడ్డి ఆధ్వర్యంలో మండల పరిషత్ అధ్యక్ష ఎన్నికను నిర్వహించారు. పదిమంది సభ్యులు హాజరు కావడంతో ఎన్నిక నిర్వహించడానికి సాంకేతిక అవాంతరం లేదని అధికారులు నిర్ణయం తీసుకొని నామినేషన్ ప్రక్రియను ప్రారంభించారు. మండలంలోని తోసిపూడి గ్రామానికి చెందిన తేతలి సుమ అధ్యక్ష పీఠానికి నామినేషన్ వేస్తారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయం వరకు వేచి చూసిన మరో నామినేషన్ రాకపోవడంతో తేతలి సుమను అధ్యక్షురాలిగా ఎన్నికల అధికారి అచ్యుత రామారెడ్డి ప్రకటించడం అనంతరం ప్రమాణస్వీకారం చేయటం వెంట వెంటనే జరిగిపోయాయి. అప్పటికే ఎన్నికల హాల్లో ఉన్న రామకృష్ణారెడ్డి అధ్యక్ష పీఠాన్ని అలంకరించిన సుమను పుష్పగుచ్ఛంతో అభినందించారు. రాష్ట్రంలో మొట్టమొదటి ఎంపీపీ బిజెపికి అందించిన ఘనత నల్లమిల్లి రామకృష్ణారెడ్డి దే.

# ఆవిర్భావ దినోత్సవ వేడుకకు ఏర్పాట్లు



జిమాడుగుల, (విశాఖ సమాచారమ్):- మండలం కోరపల్లి పంచాయతీ కోరపల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కోరపల్లి పంచాయతీ హెడ్ కోటర్ దగ్గర రేపు జరగబోయే జండా ఆవిష్కరణ కొరకు ఏర్పాటు చేయడం జరుగుతుంది.ఇందులో తెలుగుదేశం పార్టీ యువ నాయకులు కోరాబు శ్రీనివాస నాయుడు, బూత్ ఇన్చార్జి కోరాబు చిట్టి నాయుడు, ఎక్స్ మాజీ ఎంపీపీ అంగనైని సన్యాసినాయుడు, సూపర్ ఎంపీటీసీ అంగనైని వెంకటరమణ, అంగనేని బంగారు నాయుడు, వనపాల సింహాచలం, కోరాబు రామకృష్ణ, కిట్లాంగి పవన్ కుమార్, కోరాబు సింహాచలం, తెలుగుదేశం పార్టీ నాయకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



తాళ్ళపూడి, (విశాఖ సమాచారమ్):- తాళ్లపూడి మండలంలో కొవ్వూరు నియోజకవర్గ శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసారు. మండలంలో తిరుగుడు మెట్ట, పెద్దేవం, పెనకనమెట్ట, బల్లిపాడు వేగేశ్వరపురం, ప్రక్కిలంక గ్రామాలలో పర్యటించి లబ్ధి దారులకు చెక్కులు అందజేసారు తిరుగుడుమెట్ట గ్రామంలో సాలి శివన్నారాయణ కు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరు కాబడిన రూ.30,787/- ల చెక్కును వారి స్వగృహము నందు ఎమ్మెల్యే అందజేశారు . ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు నామన పరమేశ్వరరావు, జనసేన పార్టీ మండల అధ్యక్షులు గంటా కృష్ణ, తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేడు టిడిపి ఆవిర్భవం దినోత్సవం

జి.మాడుగుల, (విశాఖ సమాచారమ్):- తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి గ్రామపంచాయతీలతో పాటు పార్టీ కార్యాలయంలో పార్టీ పతాకం ఆవిష్కరణ జరుగుతుందని మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కిమ్మొడు కళ్యాణం, అధికార ప్రతినిధి దళాయి ఈశ్వరరావు తెలిపారు.ప్రతీ కార్యకర్తలతో పాటు నాయకులు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు అందరూ పాల్గొని జెండా ఆవిష్కరణలో పాల్గొనాలని ఆయన కోరారు.

# ఆకెళ్ల నాటికల ఉత్సవాలను ప్రారంభించిన మాజీ మంత్రి దాడి



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):- నాలుగు సంవత్సరాలుగా అనకాపల్లి లో శ్రీమతి జ్యోతి సరళ స్మారక కళాపరిషత్ ఆధ్వర్యంలో నాటక పోటీలు నిర్వహించడం ఎంతైనా అభినందనీయమని మాజీ మంత్రి దాడి వీరభద్రరావు అన్నారు. ఇక్కడ మూడు రోజులు పాటు నిర్వహించబడుతున్న ఆకెళ్ళ నాటికల ఉత్సవాలను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. నాటికల నిర్వాహకుడు పిసిహెచ్ నాయుడు ఆకెళ్ళ వంటి రచయిత నాటికలను మూడు రోజులపాటు రెండేసి నాటికలు ప్రదర్శింపజేయడం అభినందనీయమన్నారు. నాటికలు ప్రతి సంవత్సరం ప్రదర్శించబడటం వలన నాటకం ప్రజల్లో సజీవంగా ఉంటుందని ప్రతి ఒక్కరు నాటక పరిషత్తులను ప్రోత్సహించాలని ఆయన కోరారు.. ఈ కార్యక్రమంలో పోటీల నిర్వాహకుడుపి సి హెచ్ నాయుడు, కేఎం నాయుడు, విల్లూరి రాము, కర్రీ దివాకరరావు, సూరిశెట్టి రమణప్పరావు, ఆర్టిస్ట్ హేమ, దేవాదుల శివాజీ తదితరులు పాల్గొన్నారు.

# వడదెబ్బ తగలకుండా చల్లటి ద్రావణాలు తీసుకోవాలి



తాళ్ళపూడి, (విశాఖ సమాచారమ్):- ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నందున ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సంధ్య పేర్కొన్నారు. తాళ్లపూడి లో ఉన్న ప్రైవేటు ఆస్పత్రుల సాధారణ తనిఖీలలో భాగంగా తాళ్లపూడి పీహెచ్సీకి ఆమె విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న కారణంగా వృద్ధులు, చిన్న పిల్లలు, బాలింతలు, ఎండ సమయంలో బయటకు రావద్దని సూచించారు. వడదెబ్బ తగలకుండా ఓ ఆర్ ఎస్ మజ్జిగ వంటి ద్రావకాలు తీసుకోవాలని సూచించారు. ఒకవేళ వడ దెబ్బ తగిలితే స్థానిక పీహెచ్సీల్లో వైద్య సలహాలు తీసుకోవాలని తెలిపారు.

క్లాసిఫైడ్స్ ప్రకటనల కొరకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 95535 74250

# క్రీడా సమాచారమ్

## అప్పుడు అలా.. ఇప్పుడు ఇలా..

### లఖ్‌నవూ ఓనర్ రియాక్షన్ వైరల్



**ఇంటర్నెట్ డెస్క్:** అదే ప్రత్యర్థి.. సంవత్సరం కిందట ఘోర ఓటమి. ఇప్పుడు అద్భుత విజయం. అప్పుడు ఆ ఫ్రాంచైజీ ఓనర్ వ్యవహరించిన తీరు.. ఇప్పటి రియాక్షన్ సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారిపోయింది. ఇంతకీ ఆ జట్టు ఏంటనేది ఇప్పటికే అర్థమై ఉంటుంది కదా.. లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ . ఈ టీమ్‌కు యజమాని సంజీవ్ గొయెంకా. అసలు ఇప్పుడు ఏమైంది? గత సంవత్సరం ఏం జరిగిందంటే?

తాజాగా సన్‌రైజర్స్ హైదరాబాద్ ను ఉప్పల్ మైదానంలోనే చిత్తు చేసిన లఖ్‌నవూ పాయింట్ల పట్టికలో ఖాతా తెరిచింది. భారీ హిట్టింగ్ చేసే ఎస్ఆర్‌హెచ్‌ను బౌలింగ్‌లో అడ్డుకొన్న లఖ్‌నవూ.. బ్యాటింగ్‌లోనూ దూకుడుగా ఆడి అలవోకగా గెలిచింది. దీంతో మ్యాచ్ అనంతరం కెప్టెన్ రిషభ్ పంత్‌ను ఎల్ఎస్‌జీ ఓనర్ సంజీవ్ గొయెంకా గట్టిగా హగ్ చేసుకొని సంతోషం వ్యక్తంచేశారు. మ్యాచ్ జరుగుతున్నంతసేపు జట్టును ఉత్సాహపరచడం గమనార్హం. అంతకుముందు తొలి మ్యాచ్‌లో దిల్లీ చేతిలో ఓటమి పాలైనప్పుడూ లఖ్‌నవూ ఆటగాళ్లలో నైరాశ్యం పోగొట్టేందుకూ ప్రయత్నించారు. డ్రెస్సింగ్ రూమ్‌లో ప్లేయర్లతో సంభాషించారు. రూ.27 కోట్లను వెచ్చించి సొంతం చేసుకున్న రిషభ్ పంత్ మొదటి మ్యాచ్‌లో డకౌట్ అయ్యాడు. అటు సారథిగానూ గెలిచే సమయంలో పొరపాటు నిర్ణయాలతో దిల్లీ చేతిలో ఓటమికి కారణమయ్యాడు. దీంతో గతేడాది మాదిరిగా కేఎల్ రాహుల్‌తో సంభాషించినట్లే ఈసారి కూడా పంత్‌పై ఆగ్రహం వ్యక్తంచేస్తారని అంతా ఊహించారు. అందుకు భిన్నంగా స్పందించడం గమనార్హం. అయినా సరే, పంత్‌ను ఒక్కమాట అనకుండా ప్రోత్సహించారు. ఇప్పుడిదే వర్కౌట్ అయింది. డేంజరస్ బ్యాటింగ్ లైనప్ కలిగిన సన్‌రైజర్స్‌ను లఖ్‌నవూ బౌలర్లు సమర్థంగా కట్టడి చేశారు. ఆ ఉత్సాహంతో బ్యాటింగ్‌లోనూ రాణించి విజయం సాధించింది.

**కేఎల్ రాహుల్‌తో..**

గత సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో 166 పరుగుల టార్గెట్‌ను కాపాడుకోవడంలో లఖ్‌నవూ ఘోరంగా విఫలమైంది. అప్పటి కెప్టెన్ కేఎల్ రాహుల్ నిర్ణయాలు కూడా సన్‌రైజర్స్‌ను అడ్డుకోలేకపోయాయి. కేవలం 9.4 ఓవర్లలోనే ఎస్ఆర్‌హెచ్ ఛేదించి గెలిచింది. మ్యాచ్ అనంతరం కేఎల్‌తో సంజీవ్ సీరియస్‌గా జరిగిన సంభాషణ అప్పుడు వైరల్‌గా మారింది. కెప్టెన్‌తో ఇలాగేనా మాట్లాడేది అంటూ కామెంట్లూ వచ్చాయి. ఆ తర్వాత కేఎల్ రాహుల్ జట్టును వీడే పరిస్థితి తీసుకొచ్చింది.

## సామాన్యుల సొంత ఇంటి కల చరణ్ గ్రూప్ తోనే
## ఉగాదికి కోస్టల్ కారిడార్ లేఔట్ ప్రారంభం

### చరణ్ గ్రూప్ అధినేత వేముల పరంధామయ్య నాయుడు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్ (ఉత్తరాంధ్ర బ్యూరో):-** తెలుగువారి నూతన సంవత్సరమైన ఉగాది పర్వదిన సందర్భంగా చరణ్ గ్రూప్ అధినేత చైర్మన్ అయిన వేముల పరందమై నాయుడు సామాన్యుల నుంచి అన్ని వర్గాల వారికి సొంత ఇల్లు సాకారం చేసుకునే విధంగా దిన దిన అభివృద్ధి చెందుతున్న విశాఖపట్నం జిల్లాలో 10 ఎకరాల్లో సువిశాలమైన రోడ్లు కలిగి లేఅవుట్ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన విశాఖ సమాచారమ్ బ్యూరోతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంతవరకు చరణ్ గ్రూపులో కొన్ని లేఔట్‌లు వేసి అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే ధరలతో ఇంటి స్థలాలు ఏర్పాటు చేశామని తెలిపారు. సామాన్యులకు అతి తక్కువ ధరలకు ఇళ్ల స్థలాలు గాని ప్లాట్లు కాని అతి తక్కువ ధరకు ఇచ్చే ఘనత సంస్థ తన చరణ్ గ్రూప్ అని ఆయన అన్నారు. ప్రస్తుతం కొత్తగా ఏర్పాటు చేస్తున్న కోస్టల్ కారిడార్ లేఔట్ పక్కనుంచే 80 అడుగులు గల చిప్పాడ పోలిపల్లి రహదారీ ఉందని ఈ రహదారి జాతీయ రహదారికి అనుసంధానమై ఉంటుందని తెలిపారు. ఒక పక్క భోగాపురం ఎయిర్పోర్ట్ కి రెండు కిలోమీటర్ల దూరం లో ఉందని ఆయన అన్నారు. అంతేకాకుండా మధురవాడ ఐటీ సెజ్ ,ఇంజనీరింగ్ కళాశాలలు, వైద్య కళాశాలలు కు అంతర్జాతీయ స్కూళ్ల కు అతి దగ్గరలో ఈ కోస్టల్ కారిడార్ లేఅవుట్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చరణ్ గ్రూపు డైరెక్టర్లు గొల్లి అప్పలనాయుడు (నాని),గొల్లి శ్యామ్ సుందర్ రావు, సీనియర్ మేనేజర్ బైపురెడ్డి.సురేష్ నాయుడు, బత్తిన మంగరాజు, గుమ్మడి వంశీ చక్రధర్, డేవిడ్ రాజు, భారతి, తదితరులు పాల్గొన్నారు.

## ఫస్ట్ ధోనీకి.. తర్వాతే సీఎస్కేకు సపోర్ట్

### ఇది వారికి ఇబ్బందికరమే: రాయుడు



**ఇంటర్నెట్ డెస్క్:** ఎంఎస్ ధోనీ కనీసం ఒక్క బంతిని ఆడటం చూసినా చాలని భావించే సీఎస్కే అభిమానులు కోకొల్లలు. గత సీజన్‌లో అతడి బ్యాట్ నుంచి భారీ సిక్స్‌లు వచ్చిన సంగతి తెలిసిందే. చెన్నై సూపర్ కింగ్స్ క్రేజ్‌కు కారణం ఎంఎస్ ధోనీ. సుదీర్ఘంగా ఆ జట్టుతో ప్రయాణిస్తోన్న అతడి కోసమే మైదానాలకు వచ్చేవాళ్లు ఉన్నారంటే అతిశయోక్తి కాదు. ఇప్పటికీ ధోనీ బ్యాటింగ్ చూసేందుకు ప్రేక్షకులు పోటీపడతారు. అయితే, ధోనీ క్రేజ్ ముందు సీఎస్కేలోకి కొత్తగా వచ్చే క్రికెటర్లు ఇబ్బందిపడతారని.. వారిపై ఒత్తిడి కూడా ఎక్కువగా ఉంటుందని మాజీ క్రికెటర్ అంబటి రాయుడు వ్యాఖ్యానించాడు. అసలు సీఎస్కేకు మద్దతు ఇస్తున్నారంటే తొలుత ధోనీ కి ఫ్యాన్స్ అయి ఉంటారని వెల్లడించాడు.

"సీఎస్కేలో కొత్తవాళ్లకు ఆరంభంలో కాస్త కష్టంగా అనిపిస్తుంది. ధోనీ కోసం అభిమానులు భారీగా వస్తారు. ఆ మద్దతు అద్భుతం. బ్యాటింగ్‌కు వెళ్లినప్పుడు త్వరగా ఔటై పోవాలని వారు కోరుకుంటారు. అలాగని జట్టు ఓడిపోవాలని కాదు. ధోనీ త్వరగా బ్యాటింగ్‌కు రావాలనేదే వారి ఆకాంక్ష. అందుకే, అతడిని తలా (నాయకుడు) అని పిలుస్తారు. సీఎస్కేపై ధోనీ ప్రభావం చాలా ఎక్కువ. ఆ జట్టు కోసం అతడు చేసిన దానికే పెద్దఎత్తున ఫ్యాన్స్ అయిపోయారు" అని రాయుడు తెలిపాడు.

**చాలామంది బయటకు చెప్పలేరు..**

"ఐపీఎల్ ఆరంభం నుంచి ధోనీ క్రేజ్‌తోనే సీఎస్కే ముందుకుసాగుతోంది. చాలామంది క్రికెటర్లు తమ మనసులో అనుకొన్న విషయాలను బయటకు చెప్పలేరు. అలాంటివాటిల్లో ధోనీ క్రేజ్ కూడా ఉంటుంది. ధోనీని క్రీజ్‌లో చూడాలనుకొనే క్రమంలో సొంత జట్టు బ్యాటర్లనే ఔట్ కావాలని కోరుకుంటారు. ఇది కాస్త కొత్తగానే అనిపిస్తుంది. జట్టులోని ఇతర ప్లేయర్లు తమ సత్తా చాటేందుకు వేదికగా నిలుస్తుందనడంలో సందేహం లేదు. అదే సమయంలో ఒత్తిడి కూడా ఎక్కువగానే ఉంటుంది. దీనిని తప్పించుకోవడం చాలా కష్టం. ధోనీ రిటైర్‌మెంట్ అంశం ఎప్పుడూ క్లిష్టమైందే. అభిమానులను ఈ స్థాయిలో మైదానాలకు రప్పించే స్థాయి కలిగిన క్రికెటర్‌ను మరొకరిని తయారుచేసుకోవాల్సిన అవసరం సీఎస్కేకు ఉంది. ధోనీ ఉండటం వల్ల ప్రతి రోజూ స్టాండ్స్ నిండిపోతున్నాయి. ఈ స్థాయి క్రికెటర్ మరొకరు లేరని భావిస్తున్నా" అని రాయుడు తెలిపాడు.

## 'ఈడెన్ గార్డెన్స్' పిచ్ వివాదం.. క్యూరేటర్ యూటర్న్



**ఇంటర్నెట్ డెస్క్:** సొంత మైదానాల్లో జరిగే మ్యాచుల్లో తమకు అనుకూలంగా ఉండే పిచ్‌లను తయారుచేయించుకోవడం సాధారణమైన విషయమే. కానీ, కోల్‌కతా ఆడిన మొదటి మ్యాచ్‌కు వాడిన పిచ్ ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఐపీఎల్ 2025 సీజన్ తొలి మ్యాచ్ ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగింది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన కోల్‌కతా నైట్ రైడర్స్‌కు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు షాక్ ఇచ్చింది. అయితే, ఇక్కడే 'పిచ్' వివాదం మొదలైంది. తాను అడిగినట్లు పిచ్‌ను తయారుచేయలేదని క్యూరేటర్‌ను ఉద్దేశించి కేకేఆర్ సారథి అజింక్య రహానె చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. దానిపై స్పందిస్తూ పిచ్ క్యూరేటర్ సుజన్ ముఖర్జీ "ఐపీఎల్ నిబంధనల ప్రకారం ఫ్రాంచైజీలకు పిచ్‌ను ఫలానావిధంగా తయారుచేయాలని చెప్పే హక్కు లేదు. అయినా నేను బాధ్యతలు స్వీకరించినప్పటినుంచి ఇదే కొనసాగుతోంది. భవిష్యత్తులోనూ మారే అవకాశం లేదు. ఆర్సీబీ స్పిన్నర్లు వికెట్లు తీయగలిగినప్పుడు కేకేఆర్ స్పిన్నర్లు ఎందుకు చేయలేకపోయారు? కృనాల్ మూడు వికెట్లు తీశాడు" అని వ్యాఖ్యానించాడు. దీంతో అతడిపై తీవ్రస్థాయిలో విమర్శలు రాగా, గతంలో తాను చేసిన వ్యాఖ్యలపై యూటర్న్ తీసుకున్నాడు. తానెప్పుడూ కేకేఆర్ నుంచి వచ్చిన విజ్ఞప్తులను తిరస్కరించలేదని తెలిపాడు.

"తొలి మ్యాచ్‌కు సంబంధించి ఏ అధికారి లేదా ప్లేయర్ నన్ను సంప్రదించలేదు. ప్రాక్టీస్ సమయంలో కోచ్ మాత్రమే నాతో మాట్లాడారు. పిచ్ ఎలా స్పందిస్తుందని అడిగారు. దానికి సమాధానంగా 'పిచ్ టర్న్ అవుతుంది. అదే సమయంలో బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంటుంది' అని చెప్పా. నేనెప్పుడూ కేకేఆర్ నుంచి వచ్చే వాటిని తిరస్కరించలేదు. సుదీర్ఘకాలంగా నాకు మంచి అనుబంధం ఉంది. బీసీసీఐ గైడ్‌లైన్స్ ప్రకారమే పిచ్‌ను తయారుచేశా. నాపై ఆరోపణలు చేసే వారి సంగతి పట్టించుకోను" అని ముఖర్జీ వెల్లడించారు.

**అంతకుముందు రహానె ఏమన్నాడంటే?**

బెంగళూరుతో మ్యాచ్ అనంతరం రహానె మాట్లాడుతూ.. "పిచ్ స్పిన్‌కు అనుకూలంగా ఉంటుందని ఆశించాం. కానీ, అలా జరగలేదు. మ్యాచ్‌కు ముందు ఒకటిన్నర రోజుల పాటు కవర్స్‌తో కప్పి ఉంది. మా జట్టులో నాణ్యమైన స్పిన్నర్లు ఉన్నారు. ఎలాంటి వికెట్ పైనైనా అత్యుత్తమంగా బంతు లేయగలరు" అని రహానె తెలిపాడు.

**అక్కడినుంచి వెళ్లిపోండి: సైమన్ డౌల్**

"సొంత మైదానాల్లో అనుకూలంగా పిచ్‌ను తయారుచేయించుకోలేకపోతే ఇంకెందుకు? వారు స్టేడియాలకు సంబంధించి ఫీజులను కడుతున్నారు. కానీ, హోం టీమ్ అడిగింది క్యూరేటర్ చేయకపోతే ఎలా? అలాంటప్పుడు ఫ్రాంచైజీని వేరే మైదానానికి మార్చేసుకుంటే సరిపోతుంది. అతడి బాధ్యత పిచ్‌ను తయారుచేయడమే. మ్యాచ్‌పై అభిప్రాయాలను వెల్లడించడానికి కాదు అతడికి పే చేస్తుంది" అని కివీస్ మాజీ క్రికెటర్, వ్యాఖ్యాత సైమన్ డౌల్ వ్యాఖ్యానించాడు.

## ధోనీ మాటలనే ఆచరించా: పంత్



**ఇంటర్నెట్ డెస్క్:** భీకరమైన ఫామ్‌లో ఉన్న సన్‌రైజర్స్ హైదరాబాద్ కు లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ అడ్డుకట్ట వేసింది. ఉప్పల్ మైదానం వేదికగా జరిగిన మ్యాచ్‌లో అన్ని విభాగాల్లో ఎస్ఆర్‌హెచ్‌పై లఖ్‌నవూ ఆధిపత్యం ప్రదర్శించింది. ఐపీఎల్ 2025 సీజన్‌లో తన మొదటి మ్యాచ్‌లో విజయానికి చేరువగా వచ్చి ఓడినప్పటికీ.. రెండో పోరులో మాత్రం లఖ్‌నవూ స్ఫూర్తిదాయకమైన ఆటను ప్రదర్శించింది. క్లిష్ట సమయాల్లో ఎలా ఉండాలో తన మెంటార్ ఎంఎస్ ధోనీ నుంచి నేర్చుకొన్నట్లు లఖ్‌నవూ కెప్టెన్ పంత్ వెల్లడించాడు.

"గొప్ప ఊరట కలిగించే ఫలితం. మేమెప్పుడూ టీమ్ వర్క్ మీదనే దృష్టిపెడతాం. అలాగని విజయం సాధించినప్పుడు పొంగిపోం. ఓడినప్పుడు కుంగిపోం. మన చేతుల్లో లేనివాటి గురించి ఆలోచించం. నా మెంటార్ (ఎంఎస్ ధోనీ) నుంచి నేర్చుకున్నదదే. మన కంట్రోల్‌లో ఉన్న వాటిపైనే దృష్టిపెట్టాం. యువ బౌలర్ ప్రిన్స్ చక్కగా బౌలింగ్ చేశాడు. శార్దూల్ ఠాకూర్ అద్భుతం. పూరన్‌ను బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందు పంపించడంలో ప్రత్యేక కారణం ఏమీ లేదు. అతడికి ఇంకాస్త స్వేచ్ఛ ఇవ్వాలనే అలా చేశాం. దూకుడుగా ఆడేటప్పుడు మరింత ప్రోత్సాహం ఇవ్వాలి. ఇప్పటికీ మా అత్యుత్తమ క్రికెట్ ఆడలేదనుకుంటున్నా. అయితే, ఈ విజయం మాకు సంతోషం కలిగించింది" అని పంత్ వెల్లడించాడు.

**సిక్స్‌ల కోసం ప్లాన్ చేయలేదు: నికోలస్ పూరన్**

"ఆరెంజ్ క్యాప్ అందుకోవడం బాగుంది. అంతకుమించి విజయం సాధించడం ఎక్కువ ఆనందాన్నిచ్చింది. ప్రత్యేకంగా సిక్సుల కోసం ఎలాంటి ప్రణాళికలు రూపొందించుకోలేదు. బంతిని సరిగ్గా టైమ్ చేసి బాదా. మ్యాచ్‌లో సరైన సమయంలో నైపుణ్యాన్ని అమలుచేస్తే అలవోకగా పరుగులు వస్తాయి. హైదరాబాద్‌లో ఎప్పుడూ భారీ స్కోర్లే నమోదవుతాయి. పవర్ ప్లేలో వికెట్లు పడకుండా ఉంటే ఎంతటి లక్ష్యాన్నైనా ఛేదించే అవకాశం ఉంటుంది. మిచెల్ మార్ష్‌తో కలిసి లెఫ్ట్-రైట్ కాంబినేషన్‌తో పరుగులు రాబడుతున్నా. మంచి భాగస్వామ్యాలు నమోదు చేస్తే ఆటోమేటిక్‌గా మ్యాచ్‌పై పట్టు సాధించడం సులువు" అని ఆరెంజ్ క్యాప్ హోల్డర్ నికోలస్ పూరన్ తెలిపాడు. రెండు మ్యాచుల్లో 145 పరుగులు చేశాడు. పర్పుల్ క్యాప్‌ను శార్దూల్ ఠాకూర్ (6 వికెట్లు) సొంతం చేసుకున్నాడు.

## 'సూపర్ బాల్'కూ అవార్డు ఇస్తే బాగుండు: అశ్విన్



**ఇంటర్నెట్ డెస్క్:** ఏదైనా విషయాన్ని సూటిగా మాట్లాడటంలో అశ్విన్ ముందుంటాడు. ఓవైపు ఐపీఎల్‌లో ఆడుతూనే.. తన యూ ట్యూబ్ ఛానల్‌లో నిర్వహించే చర్చల్లోనూ చురుగ్గా పాల్గొంటున్నాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో తొలివారం కూడా ముగియకుండానే ఇప్పటికే మూడు మ్యాచుల్లో 230o స్కోర్లు నమోదయ్యాయి. గతేడాది కూడా ఇదే దూకుడు కనిపించింది. ఇటీవల టీ20ల్లో 200 పరుగుల స్కోరు ఉన్నా విజయం సాధిస్తామనే నమ్మకం లేదు. బ్యాటర్లకు పూర్తి అనుకూలంగా మారిన పిచ్‌లపై ఎవరైనా బౌలర్ అద్భుతంగా బంతులేస్తే వారిని ప్రత్యేకంగా ప్రోత్సహించేలా అవార్డు ఉంటే బాగుంటుందని సీఎస్కే ఆటగాడు రవిచంద్రన్ అశ్విన్ వ్యాఖ్యానించాడు.

"ఐపీఎల్ మ్యాచ్ ప్రెజెంటేషన్‌లో చాలా అవార్డులకు చోటు కల్పించారు. దాదాపు 10 అవార్డులను అందజేస్తున్నట్లుంది. ఇరు జట్ల ఆటగాళ్లు చెరో సగం అందుకొంటున్నారు. కానీ, ఎవరైనా బౌలర్ అద్భుతమైన డెలివరీ సంధిస్తే.. లేకపోతే నాణ్యమైన ఓవర్ వేస్తే వారికి కనీసం ఒక్క అవార్డు లేదు. ఓవరాల్‌గా ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ బౌలర్‌కు వస్తే తప్ప.. ఇలా సూపర్ స్ట్రైకర్, సూపర్ ఫోర్లు, సూపర్ సిక్స్‌లకు ఇచ్చినట్లుగా 'సూపర్ బాల్'కూ ఇస్తే బాగుంటుంది. ఒకసారి ఫాస్టెస్ట్ బాల్‌కు అవార్డు ఇచ్చినట్లు గుర్తు. ఆ బంతిని సిక్స్‌గా కొట్టినా సరే అవార్డు మాత్రం వచ్చింది. అలాకాకుండా ఉత్తమ బంతి అంటే బ్యాటర్ ఎదుర్కోవడానికి ఇబ్బందిపడిన దానికి ఓ అవార్డు ఉంటే బాగుంటుంది." అని వెల్లడించాడు.

**నా దృష్టిలో అతడే అత్యంత విలువైన ఆటగాడు..**

పంజాబ్ - గుజరాత్ మ్యాచ్ పైనా తన విశ్లేషణను అశ్విన్ వెల్లడించాడు. శ్రేయస్ అయ్యర్ (97బి)కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ వచ్చినప్పటికీ.. అత్యంత విలువైన ఆటగాడు మాత్రం విజయ్‌కుమార్ వైశాఖ్ అని అశ్విన్ తెలిపాడు. "ఇంపాక్ట్‌గా వచ్చిన వైశాఖ్ తన తొలి రెండు ఓవర్లలో కేవలం పది పరుగులే ఇచ్చి గుజరాత్‌ను కట్టడి చేశాడు. 15 ఓవర్లకు 169/2 స్కోరుతో ఉన్నప్పుడు బౌలింగ్‌కు వచ్చిన వైశాఖ్ కట్టడి చేయడం వల్లే పంజాబ్ విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన శ్రేయస్‌కు కాస్తలో సెంచరీ మిస్ అయింది. అతడి ఇన్నింగ్స్ కీలకమే కానీ.. గుజరాత్ పైచేయి సాధించకుండా చేయడంలో వైశాఖ్‌దే కీలక పాత్ర. అందుకే, అతడిని అత్యంత విలువైన ప్లేయర్‌గా పేర్కొంటా" అని అశ్విన్ వెల్లడించాడు.



I.V.L. SASTRY SANGEETHA SAMITHI
(Regd. Charitable Trust - 88/2023)
FREE MUSIC SCHOOL - ఉచిత సంగీత శిక్షణాలయం
(With Divine Blessings of Kulapathi Sri Indrakanti Venkata Lakshmana Sastry)
(కులపతి శ్రీ ఇంద్రకంటి వేంకటలక్ష్మణశాస్త్రిగారి దివ్య ఆశీస్సులతో)
29-2-28/1, SBI Colony, Prakasarao Peta, Visakhapatnam - 530 020
Phones : 6302661211, 8309220060, 9989719027

కర్ణాటక సంగీతములో **ఉచితముగా** శిక్షణ నిచ్చుటకు మరియు వేణుగానము, భక్తి సంగీతములలో కూడా 1 సం॥ కోర్సులకు నూతన తరగతులు ప్రారంభింపబడుచున్నవి. నిర్ణీత ఫారములలోని దరఖాస్తులతో తేది 06-04-2025 ఆదివారం ఉదయం 6-30 నుండి 9 గంటలలోపున శ్రీ రాఘవేంద్రస్వామి మఠము వద్ద కలియవలెను. దరఖాస్తు ఫారము, పై అడ్రస్ వద్ద గానీ, అదే రోజున అనగా 06-04-2025వ తేదీన శ్రీరాఘవేంద్రస్వామి మఠము నందుగానీ లభించును.

1 Year Music Foundation Course

ఈ తరగతులు ప్రతి ఆదివారం ఉదయం 6.30 గం॥ల నుండి 8.30 గం॥ల వరకు రామ్‌నగర్‌లోని శ్రీ రాఘవేంద్రస్వామిమఠ ప్రాంగణములో శిక్షణ యివ్వబడును. ఇందులో త్యాగరాజాది వాగ్గేయకారుల రచనలు, శాస్త్రీయ సంగీతపాఠము అలంకారముల వరకూ, రాగములు, తాళములు పోల్చుకొనుట మొదలగు అంశములతో శాస్త్రీయ సంగీత కచేరీని అవగాహన చేసుకొను సామర్థ్యము కలుగజేయు విషయములు నేర్పబడును. ఈ తరగతి 06-04-2025 అదే రోజున అనగా ఆదివారము ఉదయం 8.30 గంటలకు శ్రీ రాఘవేంద్రస్వామిమఠం ప్రాంగణములో ప్రారంభింపబడును.

1 Year Devotional Music Course

ఈ తరగతులు ప్రతి ఆదివారం ఉదయం 9.30 గం॥ల నుండి 11.00 గం॥ల వరకు ప్రార్థనశ్లోకములు, రామదాసు కీర్తనలు, జయదేవ అష్టపదులు, నారాయణతీర్థ తరంగములు మరియు వివిధ వాగ్గేయకారుల కీర్తనలు ఐ.వి.యల్.శాస్త్రి సంగీత సమితి ట్రస్ట్ భవనములో డో.నెం. 29-2-28/1, శ్రీ పి. జగన్మోహనరావు (అడ్వకేట్) గారి నివాసం, ఎస్.బి.ఐ. కాలని, సి.యం.ఆర్. షాపింగ్‌మాల్ వెనుక, జడ్జికోర్టు ఎదురుగా, ప్రకాశరావుపేట, విశాఖపట్నం - 530 020 నందు శిక్షణ ఇవ్వబడును. ఈ తరగతులు 06-04-2025వ తేదీ నుండి ప్రారంభించబడును.

2 Years Flute Classess

ఈ తరగతులు ప్రతి మంగళవారం మరియు గురువారం ఉదయం 6.30 గం॥ల నుండి 8.30 గం॥ల వరకు ఐ.వి.యల్.శాస్త్రి సంగీత సమితి ట్రస్ట్ భవనములో డో.నెం. 29-2-28/1, శ్రీ పి. జగన్మోహనరావు (అడ్వకేట్) గారి నివాసం, ఎస్.బి.ఐ. కాలని, సి.యం.ఆర్. షాపింగ్‌మాల్ వెనుక, జడ్జికోర్టు ఎదురుగా, ప్రకాశరావుపేట, విశాఖపట్నం - 530 020 నందు శిక్షణ ఇవ్వబడును. ఈ తరగతులు 07-04-2025వ తేదీ నుండి ప్రారంభించబడును.

1 Year అన్నమాచార్య - పురందరదాసు

ఈ తరగతులు ప్రతి శనివారం ఉదయం 10.00 గం॥ల నుండి 12.00 గం॥ల వరకు ఐ.వి.యల్.శాస్త్రి సంగీత సమితి ట్రస్ట్ భవనములో డో.నెం. 29-2-28/1, శ్రీ పి. జగన్మోహనరావు (అడ్వకేట్) గారి నివాసం, ఎస్.బి.ఐ. కాలని, సి.యం.ఆర్. షాపింగ్‌మాల్ వెనుక, జడ్జికోర్టు ఎదురుగా, ప్రకాశరావుపేట, విశాఖపట్నం - 530 020 నందు శిక్షణ ఇవ్వబడును. ఈ తరగతులు 12-04-2025వ తేదీ నుండి ప్రారంభించబడును.


VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : S.Veerabhadra Rao , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839, 9160190123
Hyderabad (Sai Ganesh) : Cell : 9030841841, Parawada (satyanarayana): Cell: 77804 33919, Srikakulam : Cell: 70321 98574, For advertisements (Raghunath) : 7013785256, Arilova (D.Venkatesh) : 94937 77390.
Maddilapalem (G.Raamakrishna) : 99084 24231, Anakapalli (M.Krishna Rao) : 63023 75539, Chintapalli (Srinivas) : 94923 40861.
Bheemunipatnam (B.Appalareddy) : 98662 78981, Srikakulam (Ramarao) : 70321 98574, Pithaapuram (staalin) : 94912 23264,

గమనిక : ఇక్కడ ఇవ్వబడిన పేర్లు కలిగిన వారిని మాత్రమే విశాఖ సమాచారమ్ దినపత్రికకు విలేఖరులుగా గుర్తించవలెను. ఇక్కడ పేరు లేకుండా ఎవరైనా విశాఖ సమాచారమ్ ప్రతినిధిగా చెబితే నమ్మవద్దు.